ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఏలూరు
జిల్లా వార్తలు
5
గురువారం 11 జూలై 2024

ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 26.0


సమావేశంలో పాల్గొన్న అధికారులు, బ్యాంకర్లు

డ్వాక్రా సంఘాల బలోపేతంలో బ్యాంకర్లదే కీలకపాత్ర

- కౌలు రైతులు , వీధి వ్యాపారుల రుణాల మంజూరులో మానవతా దృక్పథం చూపాలి
- జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి



ఏలూరు సిటీ, జూలై 10 : మానవతా దృక్పథంతో కౌలు రైతులు, వీధి వ్యాపారులు, ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు ఆర్థిక తోడ్పాటుకు సులభంగా రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని, డ్వాక్రా సంఘాల బలోపేతంలో బ్యాంకర్లదే కీలక పాత్ర అని కలెక్టర్ కె.వెట్రిసెల్వి బ్యాంకర్లను సూచించారు. కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో బుధవారం 2024-25 మొదటి త్రైమాసిక బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రుణాల లక్ష్య సాధనపై బ్యాంకర్లతో కలెక్టర్ సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ జిల్లా రుణ ప్రణాళిక లక్ష్యం రూ.18,256 కోట్లుగా నిర్దేశించగా ఆ లక్ష్యాలు సాధించే విధంగా అధికారులు దృష్టి సారించాలన్నారు. సీసీఆర్సీ కార్డులు కలిగిన కౌలు రైతులకు సులభరీతిలో రుణాలు అందించడంపై దృష్టి పెట్టాలన్నారు. పీఎం స్వానిధి అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టి లబ్ధిదారుల్లో అవగాహన కల్పించాలన్నారు. రుణం కోసం ఆసక్తి చూపుతున్న లబ్ధిదారులకు త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలన్నారు. వచ్చే సమావేశం నాటికి ఆయా పథకాల కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని స్పష్టం చేశారు. యూనియన్ బ్యాంక్ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ద్వారా మరిన్ని ఉపాధి శిక్షణా కార్యక్రమాలను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ద్వారకా తిరుమల వంటి పుణ్య క్షేత్రాలలో ప్రసాదాల పంపిణీకి వినియోగించే విస్తర్లు వంటివి తయారీపై గిరిజన ప్రాంతాల్లో మహిళలకు శిక్షణ ఇచ్చి ఆర్థిక సాయం అందించడం ద్వారా వారి జీవనోపాధికి దోహద పడాలని సూచించారు. ఆవులు, గేదెల యూనిట్లు ఏర్పాటుకు విరివిగా రుణాలు అందించాలని, మండలాల వారీగా క్యాంపులు నిర్వహించి ఆసక్తి గల అర్హులైన లబ్ధిదారులతో దరఖాస్తు చేయించాలని పశు సంవర్ధక శాఖ జేడీని ఆదేశించారు. వివిధ పథకాల లక్ష్యాల సాధనలో కొన్ని బ్యాంకుల పురోగతిపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంటర్‌ప్రెన్యూర్ షిప్‌ను ప్రోత్సహించటమే లక్ష్యంగా చేస్తున్న స్టాండ్ అప్ ఇండియా పథకంపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించే దిశగా సంబంధిత అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో చర్యలు చేపట్టా లని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఇందుకు సంబంధించి ప్రత్యేక వర్క్ షాప్ నిర్వహించాలన్నారు. జూలై మాసంలో సామాజిక పెన్షన్ల సొమ్ము విడుదల చేయటంలో బ్యాంకర్ల కృషిని జిల్లా కలెక్టర్ కె వెట్రి సెల్వి అభినందించారు. సమావేశంలో ఆర్‌బీఐ ఎల్‌డీవో పూర్ణిమ, ఎల్‌డీఎం నీలాద్రి, నాబార్డ్ డీడీఎం అనిల్‌కాంత్, డీఆర్‌డీఏ పీడీ విజయ రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముందడుగు

ఐదేళ్ల విధ్వంసం స్థానంలో ప్రజా పాలన

గత ఐదేళ్లు అంతా అస్తవ్యస్తం. పరిపాలన గాడి తప్పింది. ఇష్టా రాజ్యంగా అందరిది పెత్తనం. వైసీపీ కనుసన్నల్లోనే ఎవరికి తోచినట్టు వారి వైఖరి సాగింది. పట్టణం, పల్లె తేడాలేకుండా పారి శుధ్యం మూలనపడింది. రైతుల ధాన్యం బకాయిలు పూర్తిగా చెల్లించలేని పరిస్థితి. ఉద్యోగ, కార్మిక వర్గాలను పట్టించుకోని వైనం. విద్య, వైద్య రంగాలు నిర్వీర్యమయ్యాయి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాకా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి నెల రోజులు గడవకమునుపే కొత్త ఎమ్మెల్యేలు సరికొత్త మార్క్ చూపించే ప్రయత్నం చేస్తున్నారు. నిత్యం ప్రజలతో కలిసి ఉండేలా ప్రయత్నిస్తు న్నారు. చెప్పింది చేస్తాం.. చేయనిది చెప్పం.. అనే వైఖరితో ముందడుగు వేస్తున్నారు.

– ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి

- సమస్యలపైనే ఫోకస్.. ఆ వెనువెంటనే పరిష్కారం
- ఆర్థికేతర సమస్యలపై ప్రత్యేక దృష్టి
- ప్రతి నియోజకవర్గంలోనూ కొద్దిరోజుల్లోనే కూటమి కొత్తదనం

ఇప్పటివరకు ఏం జరిగింది..?

గడిచిన ఐదేళ్లల్లో పాలన వ్యవహారాలను తలచుకుంటేనే జనం ఇప్పటికి గగ్గోలు పెడుతున్నారు. తమదైన శైలిలో జగన్ సర్కార్‌కు పాతరవేసి కూటమి ప్రభుత్వానికి జేజేలు పలికినా గత చేదు స్మృతులు ఇంకా ఎవరిని వీడిపోలేదు. దెందులూరు నియోజకవర్గంలో పోలవరం కుడికాల్వ గట్ల మట్టిని తుడిచి పెట్టేసి కోట్లు కూడగట్టుకున్నారు. అడ్డుకున్న వారిపై కేసులు, ఇష్టారాజ్యంగా బెదిరింపులు, టీడీపీ శ్రేణులపై భౌతికదాడులకు దిగారు. చింతమనేని పీఏతో సహా అనేకమందిపై కేసులు నమోదు చేశారు. ద్వారకా తిరుమలలోనూ తమ ఆగడాలకు అడ్డు తగిలినా తెలుగుదేశం, జనసేన కేడర్‌ను అప్పట్లో వైసీపీ ఉపేక్షించకుండా దాడులకు దిగింది. చింతలపూడి నియోజకవర్గంలోనూ కూటమి నేతలపై కసి తీర్చుకునే ప్రయత్నం చేశారు. భూముల ఆక్రమణ, ఇసుక, మట్టి దోపిడీ అంతూపంతు లేకుండా పోయింది. ఏలూరులో గల్లీలీడర్లు కూడా దొమ్మిలు చేశారు. కొందరి పేదల ఇళ్లను, ఇంటి స్థలాలను ఆక్రమించే ప్రయత్నాలు సాగాయి. స్మార్ట్‌సిటీని చిందరవందర చేశారు. గనులశాఖ అయితే వైసీపీ నేతల ముందు దాదాపు గల్లంతు అయింది. జిల్లా పరిషత్ తగినంత పని లేక.. సమృద్ధిగా నిధులు లేక బోల్తా పడింది. జిల్లా కోఆపరేటివ్ సహకార బ్యాంక్ (డీసీసీబీ) పరిస్థితి మాటల్లో చెప్పనక్కర్లేదు. సాగునీటి లభ్యత దెబ్బతింది. వైద్యఆరోగ్యశాఖలో డజన్ల కొద్ది ఆరోపణలు. ప్రభుత్వ వైద్యకళాశాల పేరిట జనరల్ ఆస్పత్రిని కాస్త అడ్రస్ లేకుండా చేశారు. జగనన్న ఇళ్ల దుస్థితి అందరికీ తెలిసిందే.. ఇలా చెప్పుకుంటూ పోతే ఐదేళ్ల విధ్వంసం కళ్లకు కట్టినట్లు కనిపిస్తూనే ఉంది. అంగన్‌వాడీలు, ఆశా వర్క ర్లు, నిరుద్యోగులు ఒకరేంటి అందరూ రోడ్డు ఎక్కిన వారే. ఈ క్రమంలోనే అధికార పగ్గాలు చేపట్టిన కూటమి ప్రజాప్రతినిధులు జనం మధ్యకు వెళ్లుతున్నారు. ఇప్పుడు వీరందరి పని విధ్వంసం సాగిన అన్ని రంగాల్లోనూ సరిదిద్దటమే. 20204 మొదటి ఐదునెలలు కలెక్టరేట్ ముందు సాగిన డజను కొద్ది ధర్నాలు, ఇప్పుడు లేనేలేవు. తాము గెలిపించిన ప్రజాప్రతినిధులకు కొంత సమయం ఇద్దామన్న భావన ప్రజల్లో ఉండడమే.

దూసుకుపోతున్న ఎమ్మెల్యేలు

తమపట్ల అత్యంత విశ్వాసంతో అగ్రనేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ మీద ఉన్న ప్రేమాభిమానాలతో అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, వారి మన్ననలు పొందాలనే భావనలో ఎమ్మెల్యేలంతా ఎక్కువ సమయం ప్రజల మధ్యే గడుపుతున్నారు. ఏలూరు అసెంబ్లీ స్థానంలో అత్యంత కీలకం ఏలూరు కార్పొరేషన్. ఇప్పుడు స్థానిక ఎమ్మెల్యే బడేటి చంటి కార్పొరేషన్‌ను ప్రక్షాళన చేసే పనిలో పడ్డారు. ఇప్పటివరకు వైసీపీ ఆధీనంలో ఎవరి మాట వారిదే అన్నట్లుగా ఇష్టారాజ్యంగా సాగింది. పాలనా వ్యవహారాల్లో మితిమీరిన జోక్యం. ఇప్పటికి నాలుగు చినుకులు పడితే చాలు నగర రోడ్లన్నీ బురదమయమే. డ్రెయిన్‌లలో పేరుకుపోయిన చెత్త, ఎక్కడికక్కడ అపరిశుభ్రం. తాజాగా ఎమ్మెల్యే చంటి నగరంలో తెల్లవారు జామునే పారిశుధ్యం ఎలా అమలవుతుందో చూడాలని భావించి రంగంలోకి దిగారు. ఎటుచూసినా రోడ్లపై నిలిచిన వర్షపునీరే, డ్రెయిన్ నుంచి పొంగి పొర్లుతున్న మురుగునీరు సాక్షాత్కరించాయి. పారిశుధ్య సిబ్బంది సంఖ్య కొరత లేదు. స్మార్ట్‌సిటీగా నగరాన్ని తీర్చిదిద్దాలనుకునే ప్రణాళిక ఎలాగో అమలులో ఉంది. అయినా పారిశుధ్యం దుస్థితి చూసి ఎమ్మెల్యే చంటిలో ఆగ్రహం కట్టలు తెంచుకుని సిబ్బందిపై తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. దీనిపై చర్యలకు సిద్ధమంటూ ప్రకటించారు. ఎమ్మెల్యేగా గెలిచిన తొలినాళ్లల్లోనే తెల్లవారుజామున లోతట్టు ప్రాంతాల్లో ఆయన పర్యటించడం, ఎక్కడికక్కడ పారిశుధ్యం గురించి ఇతర అంశాల గురించి ప్రజల నుంచి ఆరా తీయడంతో బడేటిపై స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు లేకుండా కార్పొరేషన్ సిబ్బందిని అప్రమత్తం చేయడం ఇంకో పరిణామం. దెందులూరులో ఎమ్మెల్యేగా చింతమనేని ప్రభాకర్ గెలుపు ప్రకటన వెలువడిన కొద్ది గంటల్లోనే గ్రామాల్లో పారిశుధ్య పనులు వేగం చేయాల్సిందిగా అధికారులను ఆదేశించి, స్వయంగా పర్యవేక్షించారు. జాతీయ రహదారి సర్వీస్ రోడ్లలలో తన నియోజకవర్గ పరిధిలోని అనేకచోట్ల ప్రమాదాలు జరగడం, మరణాల సంఖ్య అత్యధికంగా ఉండడంతో ఆయన ఓ సామాన్య పౌరుడిగా మారి గత సోమవారం మీకోసంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడమే కాక ఆదేరోజు జాతీయరహదారి అధికారులతో సమావేశమై ఎక్కడికక్కడ సర్వీస్ రోడ్డులలో ఎగుడుదిగుడులను సవరించేలా చేసి అందరి మన్ననలు పొందారు. ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజక వర్గమైన చింతలపూడిలో రోషన్‌కుమార్ దూకుడు మరింత వేగంగా ఉంది. ఎవరో వచ్చి ఏదో చేస్తారని భావించకుండా తానే స్వయంగా రంగంలోకి దిగి కొన్నిచోట్ల రోడ్లకు మరమ్మతులు చేసి తాను సాధారణ ఎమ్మెల్యేనే కాదు, స్థానిక పౌరుడిని అంటూ నిరూపించారు. లింగపాలెం, చింతలపూడిలో ఎక్కడి సమస్య ఉంటే అక్కడ ప్రత్యక్షంగా హాజరై క్షణాల్లో ఆ సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తున్నారు.

ఎక్కడికక్కడ జనం మధ్యనే కూటమి ఎమ్మెల్యేలు

• మంత్రి పార్థసారథి స్పీడు..

ఏలూరు జిల్లా నుంచి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం పొందిన సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సైతం నూజివీడు నియోజకజవర్గంలో తాను ఎన్నికల్లో ఏ హామీలు అయితే ఇచ్చారో వాటిని నిలబెట్టుకునే దిశగా పావులు కదుపుతున్నారు. ఇప్పటికే ఆయన మామిడి పరిశోధన కేంద్రం ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ మేరకు నూజివీడులో వందలాది మంది మామిడి రైతులతో సమావేశం నిర్వహించడమే కాకుండా సమావేశానికి నిపుణులను సైతం ఆహ్వానించారు. నూజివీడు మామిడికి ఒప్పంద స్థాయిలో కీర్తి, ప్రతిష్ఠ దక్కేలా కొత్త మార్కెటింగ్‌కు ఆయన స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. మామిడికి ప్రసిద్ధి చెందిన నూజివీడులో ఈ చర్య సహజంగానే అందర్ని సంతృప్తిపరిచింది.


జంగారెడ్డిగూడెం మండలం చక్రదేవరపల్లిలో బుధవారం రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్

• ఎంపీ పుట్టాది ఇదే దారి

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ ఎంపీగా తన పాత్ర పదిలంగా ఉండాలని భావిస్తున్నారు. ఈ మేరకు ఆయన ఇప్పటికే ఉపాధి అవకాశాలు కల్పించడం, తాను ఇచ్చిన మాట ప్రకారం కొందరికి ఓ ఐటీ సంస్థలో ప్లేస్‌మెంట్ వచ్చేలా చూశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పోలవరం ప్రాజెక్టు సందర్శించడమే కాకుండా నియోజకవర్గంలో అత్యంత కీలకమైన చింతలపూడి ఎత్తిపోతలపై ఫోకస్ పెట్టారు. ఇంతకు ముందు మాదిరి కాకుండా ఎంపీ అంటే పెద్దమనిషిగానే కాకుండా ప్రజలకు మరింత మేలు చేసే ప్రతినిధిగా తనకు గుర్తింపు రావాలని మహేష్ ఆరాట పడుతున్నారు. ఈ క్రమంలోనే ఆయన క్షేత్ర స్థాయిలో కార్యకర్తలకు టచ్‌లో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఉంగుటూరు నియోజకవర్గంలో గెలుపొందిన జనసేన ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తాను గెలిచిన దగ్గర నుంచి ఇప్పటివరకు ఎక్కడా ఏరోజు విశ్రాంతి లేకుండా నియోజకవర్గం అంతటా ప్రయాణిస్తూనే ఉన్నారు. ప్రత్యక్షంగా ప్రజలను కలుసుకుని ఏఏ సమస్యలపై తక్షణం పరిష్కారం అవసరమో అభిప్రాయాలు సేకరించి ఆ మేరకు కార్యాచరణ రూపొందించుకుంటున్నారు. నియోజకవర్గ అధికారులతో కీలక భేటీ నిర్వహించారు. నియోజకవర్గంలో పాలనాపరంగా అంతా గాడిలో పడాల్సిందేనంటూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పోలవరంలో జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సైతం ప్రజలు విన్నవిస్తున్న సమస్యలపై ఫోకస్ పెట్టారు. నిర్వాసితుల సమస్యను తొలిప్రాధాన్య సమస్యగా ఎంచుకుని తమ పార్టీ అధిష్టానానికి నివేదించారు. కైకలూరులో సీనియర్ నేత, ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తనదైనశైలిలో దూసుకుపోతున్నారు. మొన్న ఈ మధ్యనే చాన్నాళ్ళుగా ఉన్న వర్గవిభేదాలను పూర్తిగా తొలగించి ఒక గ్రామాన్ని ఏకం చేయడంలో ఆయన సక్సెస్ అయ్యారు. ఇలా ఎవరంతటి వారుగా స్వల్పకాల వ్యవధిలోనే పనితీరుపై ప్రజా ఆమోద ముద్రపడేలా జాగ్రత్త పడుతున్నారు. ఆర్థికపరమైన విషయాలు పక్కన పెట్టి తమ పరిధిలో ఉన్న వాటిని అన్నింటిని పరిష్కరించే పనిలో పడ్డారు.

ఏడాదైనా అమలుకు నోచుకోని.. జీవో నంబర్ 60

- యూపీ పాఠశాలల్లో జరగని సబ్జెక్ట్ టీచర్ల నియామకం.. కుంటుపడుతున్న బోధన

ముదినేపల్లి, జూలై 10 : ప్రాథమికోన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను నియమించాలని ఏడాది క్రితం పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన జీవో నంబర్ 60 అమలుకు నోచుకోక వివిధ సబ్జెక్టులపై బోధన కరువైంది. అంతకు ముందు 2022 జూన్ 10న జారీ చేసిన జీవో నంబర్ 117 ఫలితంగా ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు రద్దు కావడంతో సబ్జెక్టు టీచర్లను వేరే పాఠశాలల్లో సర్దుబాటు చేశారు. దీంతో 2022-23 విద్యాసంవత్సరం ప్రాథమికోన్నత (యూపీ) పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు లేకుండానే ముగిసింది. ఆ పాఠశాలల్లో లెక్కలు, సైన్సు, ఇంగ్లీష్ బోధించే టీచర్లు కరువయ్యారు. జీవో నంబర్ 117 ప్రకారం యూపీ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ల పోస్టులు రద్దు కావడంతో కనీసం డిప్యుటేషన్‌పై వేరే టీచర్లను నియమించే అవకాశం కూడా లేకుండా పోయింది. కనీసం వర్క్ అడ్జస్ట్‌మెంట్‌కు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టలేదు. ఎలిమెంటరీ, యూపీ పాఠశాలల్లోని 3, 4, 5 తరగతుల విద్యార్థులను మూడు కిలోమీటర్ల దూరంలోపు ఉన్న హైస్కూళ్లలో విలీనం చేయ గా, మూడు కిలోమీటర్ల పైబడి దూరంలో ఉన్న యూపీ పాఠశాలల్లో పై తరగతుల విద్యార్థు లతో పాటు 6,7,8 తరగతుల విద్యార్థులు ఆయా పాఠశాల ల్లోనే ఉండిపోయారు. జీవో నంబర్ 117 ప్రకారం సబ్జెక్టు టీచర్ల పోస్టులు రద్దు కావడంతో ఆయా సబ్జెక్టుల బోధించే వారు లేకుండా పోయారు. యూపీ పాఠశాలల్లో మూడవ తరగతి నుంచి ఎనిమిదవ తరగతి వరకు సబ్జెక్టు టీచర్లు లేక నూతన విద్యా విధానం లక్ష్యం దెబ్బతింటున్న విషయా న్ని గుర్తించి న పాఠశాల విద్యాశాఖ 2023 జూన్ 6న కొత్తగా జీవో నంబర్ 60 జారీ చేసింది. ఈ జీవో ప్రకారం 98 మంది విద్యార్థులు లోపు ఉన్న యూపీ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను తిరిగి నియమించాలని విద్యాశాఖ పేర్కొంది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్తు యజమాన్యాల కింద ఉన్న పాఠశాలల్లో రద్దయిన సబ్జెక్టు టీచర్ల స్థానంలో టీచరు - విద్యార్థుల నిష్పత్తి ప్రకారం తిరిగి నియమించాలని విద్యాశాఖ స్పష్టం చేసింది. అప్పట్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు ప్రమోషన్లు ఇవ్వడం ద్వారా సబ్జెక్ట్ టీచర్లను నియమించాలన్న ప్రతిపాదన తెర మీదకు వచ్చింది. అయితే ప్రమోషన్ల వ్యవహారం మరుగున పడిపోవడంతో రద్దయిన సబ్జెక్టు టీచర్ల పోస్టు లను భర్తీ చేయలేదు. ఎస్జీటీలకు ప్రమోషన్లు ఇస్తే ప్రతీ జిల్లాలోనూ యూపీ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను నియమించే అవకాశం ఉంటుందని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేసినా ఫలితం లేకపోయింది. చివరికి జీవో నెంబర్ అమలుకు నోచుకోకపోవడంతో యూపీ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల నియామకం జరగలేదు. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడిచినా యూపీ స్కూళ్లలో 6,7,8 తరగతులకు లెక్కలు, సైన్స్, ఇంగ్లీష్ బోధించే టీచర్లు లేక విద్యార్థులు దిక్కులు చూస్తున్నారు. జిల్లాలో సుమారు 180 యూపీ పాఠశాలలు ఉండగా, ఎక్కువ శాతం పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది. దీనిపై డీఈవో అబ్రహం స్పందిస్తూ 'యూపీ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత నివారణకు చర్యలు తీసుకుంటాం. కొన్ని చోట్ల ఎస్జీటీలు సబ్జెక్టు లు బోధిస్తున్నారు. బోధన కుంటుపడకుండా టీచర్ల సర్దుబాటు చర్యలు తీసుకుంటాం'.. అని తెలిపారు.



సబ్జెక్టు టీచర్లను నియమించాలి

ప్రాథమికోన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను నియమిం చాలి. జీవో నెంబర్ 117ను రద్దు చేసి, జీవో నెంబర్ 60 ప్రకారం సబ్జెక్టు టీచర్లను నియమించాలి. రద్దయిన స్కూల్ అసిస్టెంట్ల పోస్టులను పునరుద్ధరిం చాలి. ఎస్జీటీల ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టి స్కూల్ అసిస్టెంట్లుగా నియమించాలి. కొత్త ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– సీహెచ్.మంజుల, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు

టీచర్ల 'పని సర్దుబాటు'కు త్వరలో మార్గదర్శకాలు

- కొత్త జిల్లాల పరిధిలోనే డిప్యుటేషన్లకు అవకాశం

ఏలూరు అర్బన్, జూలై 10 : జిల్లా పరిషత్, గవర్నమెంట్, మునిసిపల్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల కొరత ఏర్పడడంతో లోటును భర్తీ చేసేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. పని సర్దుబాటు (వర్క్ అడ్జస్ట్‌మెంట్)పై ప్రస్తుతానికి కొరత వున్న పాఠశాలలకు టీచర్లను డిప్యూటేషన్‌పై తాత్కాలికంగా పంపాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి రాగల రెండు, మూడురోజుల్లో ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయనున్నట్టు జిల్లా విద్యాశాఖకు సమాచారం అందింది. ఇప్పటికే మండల పరిధిలో మిగులు (సర్‌ప్లస్) టీచర్లను గుర్తిం చి కొరతవున్న స్కూళ్లకు సర్దుబాటు చేయడానికి సంబంధిత ఎంఈవోలకు అధికారాలను అప్పగించగా, ప్రభుత్వ మార్గదర్శకాలు విడుదలైన వెంటనే వాటికి అనుగుణంగా మార్పు లు చేయనున్నారు. ఈదఫా వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో కొత్త జిల్లాల ప్రాతిపదికన ఉపా ధ్యాయుల సర్దుబాటు ఉండవచ్చని ప్రచారం జరుగుతోంది. గత ప్రభుత్వం పని సర్దుబా టుకు ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన చేయడం వల్ల ఉపాధ్యాయులు సుదూర ప్రాంత పాఠశాలలకు డిప్యూటేషన్లపై వెళ్ళాల్సి వచ్చిన విషయం విదితమే. ఆ ప్రకారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో నరసాపురం డివిజన్ నుంచి సుదూర ప్రాంతమైన ఏలూరు, జంగారెడ్డిగూడెం డివిజన్లలోని మారుమూల మండలాలకు పలువురు ఉపాధ్యాయులు తాత్కాలిక బదిలీలు కావడం ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర అభ్యంతరాలు లేవనెత్తాయి. క్షేత్రస్థాయి నుంచి ఉపాధ్యాయులు నిరసనలు వ్యక్తం చేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పుడు అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం గతంలో జరిగిన లోపాలను పునరావృతం కాకుండా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే కొత్త జిల్లాల ప్రకారం టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేయనున్నట్టు సమాచారం. ఎవరికీ ఇబ్బంది లేకుండా ఈ విధానం బాగుంటుందని చెబుతున్నారు. త్వరలో విడుదల కానున్న మార్గదర్శకాల్లో విద్యార్థుల సంఖ్యలోను మార్పులు చోటుచేసుకునే అవకాశాలు లేకపోలేదు. టీచర్లకు వర్క్‌లోడ్ తగ్గే అవకాశాలున్నాయి.

రొయ్యల ధరలు పతనం

- వంద కౌంట్ టన్ను రూ.2 లక్షలే..
- సుమారు 50 వేలు నష్టం
- ఆక్వా రైతుల ఆవేదన

ముదినేపల్లి, జూలై 10 : రొయ్య ధర మరింత పతనమైంది. అమ్మకాలు ఊపందుకుంటున్నా ధరలు పెరగడం లేదు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వంద కౌంట్ రొయ్యల ధర ఆశాజనకంగా లేకపోవడంతో ఆక్వా రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారు. కొనుగోలు దారులు పలుచోట్ల సిండికేట్లుగా ఏర్పడి రొయ్యల ధరల పెరుగుదలకు అడ్డుకట్ట వేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగుకు పెట్టుబడి పెరగడం, మార్కెట్‌లో ధరలు తగ్గడంతో రొయ్యల పెంపకందారులు ఆక్వా సాగు పట్ల అనాసక్తి చూపుతున్నారు. వంద కౌంట్ రొయ్య పెంపకానికి 60 రోజుల నుంచి 70 రోజుల సమయం పడుతుంది. టన్ను వంద కౌంట్ రొయ్య చేతికి వచ్చే సరికి రూ.2.40 లక్షల నుంచి రూ.2.60 లక్షల వ్యయమవుతుంది. మార్కెట్‌లో ఈ కౌంట్ రొయ్య టన్ను ప్రస్తుత ధరల ప్రకారం రూ.2 లక్షలకు మాత్రమే అమ్ముడుబోతోంది. ధరలు ఆకస్మాత్తుగా పడిపోడడంతో టన్ను వంద కౌంట్ రొయ్యలు అమ్మితే రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు నష్టం వస్తోంది. వాతావరణంలో మార్పులకు భయపడుతున్న రైతులు సాధారణంగా వంద కౌంట్ రొయ్యలను ముందుగా పట్టుబడులు నిర్వహించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తారు. అయితే ప్రస్తుతం ధరలు పడిపోవడంతో వంద కౌంట్ రొయ్యలను అమ్మి నష్టాలను చవిచూస్తున్నారు.



పెట్టుబడులు రాని పరిస్థితి. మార్కెట్‌లో 60 కౌంట్ రొయ్య టన్నుకు రూ.2.60 లక్షలు, 70 కౌంట్ రూ.2.50 లక్షలు మాత్రమే ఉండడంతో ఆక్వా రైతులకు నష్టాలే మిగులుతున్నాయి. ఇతర రాష్ట్రాలకు పెద్దగా ఎగుమతులు లేకపోవడం, స్థానిక కంపెనీల్లో రొయ్యలను కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో ధరలు పెరగడం లేదు.

తీవ్రంగా నష్టపోతున్నాం..



రొయ్యల ధరలు తగ్గకపోవడంతో ఆక్వా రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. పెట్టుబడులు పెరిగాయి. ధరలు తగ్గిపోయాయి. వంద కౌంట్ రొయ్య కనీసం టన్ను ఒకటికి రూ.2.40 లక్షలు అమ్మితేనే పెట్టుబడి దక్కుతుంది.

– బొప్పన సుందర రామయ్య, ఆక్వా రైతు, ములకలపల్లి

ప్రభుత్వం పట్టించుకోవాలి



రొయ్యల ధరలు రైతులకు గిట్టుబాటుగా ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. సిండికేట్ల బారిన పడి ఆక్వా రైతులు నష్టపోకుండా చూడాలి.

– రెడ్డి నాగరాజు, ఆక్వా రైతు, స్తంభం చెరువు


ఐటీడీఏ పీవో ఎం.పూర్యతేజకు వినతిపత్రం అందజేస్తున్న పీవైఎల్ నాయకులు

ఐటీడీఏ వద్ద పీవైఎల్ ధర్నా

బుట్టాయగూడెం, జూలై 10 : ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కారించాలని కోరుతూ ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) ఆధ్వర్యంలో బుధవారం కేఆర్ పురం ఐటీడీఏ వద్ద గిరిజనులు ధర్నా చేసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పీవో ఎం.సూర్యతేజకు అందజేశారు. డివిజన్ నాయకు లు గురుగుంట్ల ప్రసాద్‌రెడ్డి, తగరం బాబురావు మాట్లాడుతూ ఐటీడీఏలో ప్రతి బుధవారం నిర్వహించే గిరిజన దర్బార్‌కు 60, 70 కిలోమీటర్లు నుంచి వస్తున్న గిరిజనులకు అందుబాటులో పీవో లేక నిరాశే మిగులుతోందన్నారు. సమస్యలపై ఇస్తున్న వినతిపత్రాలు పేరుకుపోతున్నాయే తప్పా పరిష్కారం కావడం లేదన్నారు. వర్షాలు కురుస్తుండడంతో ఏజెన్సీలో సీజనల్ జ్వరాలు, వ్యాధులు అధికమవుతున్నాయని అన్ని గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి వైద్యసేవలు అందించాలన్నారు. ఏజెన్సీలో పాడైపోయిన రోడ్లను, శిథిలమైన బ్రిడ్జిలను బాగుచేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్నిశాఖల్లో ఖాళీగా ఉన్న 30 వేల పోస్టులను భర్తీ చేయాలని, మధ్యలో నిలిచిపోయిన 100 పడకల ఆసుపత్రి, ప్రభుత్వ డిగ్రీ కాలేజిలను వెంటనే పూర్తిచేసి అందుబాటులోకి తేవాలన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీవో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఇ.భూషణం, కె.నాగేశ్వరావు, జె.లక్ష్మీనారాయణ, ఎస్.ముక్కారెడ్డి, పి.రాము, ఎం.మురళి, జి.బాబు రావు, బి.వినోద్, కె.శరణ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు

ఏలూరు సిటీ, జూలై 10 : జిల్లాలో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా చింతలపూడి మండలంలో 49 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 4.4 మి.మీగా నమోదైంది. జీలుగుమిల్లి 19.2, జంగారెడ్డి గూడెం 11.2, కుక్కునూరు 9.6, వేలేరుపాడు 6, టి.నరసాపురం 5.4, బుట్టాయిగూడెం 3.8, కలిదిండి 3.6, ఏలూరు అర్బన్ 3.2, పెదపాడు 2.8, లింగపాలెం 1.8, దెందులూరు, పోలవరంలలో 1.6, పెదవేగి 1.2, మండవల్లి, నిడమర్రులలో 1, కైకలూరు 0.6, భీమడోలు 0.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. వర్షాల రాకతో సార్వా పనులు జోరుగా సాగుతున్నాయి.

ఉగ్రనారసింహునిగా జగన్నాథుడు



ద్వారకాతిరుమల, జూలై 10: శ్రీలక్ష్మీ సమేత ఉగ్ర నారసింహునిగా జగన్నాథుడు బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. లక్ష్మీపురం ఆలయంలో ప్రారంభమైన జగన్నాథుని రథోత్సవాలను పురస్కరించుకుని స్వామివారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. దీనిలో భాగంగా లక్ష్మీమాతతో కలసి జగన్నాథుడు శంఖు, చక్రాలను ధరించి, ఉగ్రరూపంలో భక్తజనులకు అభయహస్తాన్ని ప్రసాదిస్తున్నట్టు నరసింహుని అలంకారం చూపరులకు కనువిందు చేసింది.

ఉద్యోగ విరమణ వయస్సు 60 ఏళ్లకు తగ్గించండి

» మంత్రి నారా లోకేశ్‌కు ఏపీటీఎఫ్ నాయకుల వినతి

ఏలూరు అర్బన్, జూలై 10 : ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతోపాటే, తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా కొనసాగించాలని కోరుతూ మంత్రికి బుధవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేసినట్టు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి.రత్నంబాబు, జి.మోహన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యంచేస్తున్న జీవో 117 ఉత్తర్వులను రద్దుచేయాలని, హైస్కూళ్ళలో రద్దుచేసిన గ్రేడ్-2 హెచ్ఎం, పీడీ పోస్టులను పునరుద్ధరించాలని కోరామన్నారు. విద్యార్థులకు నిర్వహించే పరీక్షలపై స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు ఐదురోజుల పాటు ఇచ్చే గుడ్లను తీసుకోవడానికి విద్యార్థులు ఇష్టపడడం లేదని, వీటిని వారానికి మూడు రోజులకు కుదించి, ఆరు రోజుల పాటు చిక్కీలను సరఫరాచేసేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించామన్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులపై గత వైసీపీ ప్రభుత్వం దాఖలు చేసిన కేసు నెంబరు 247/23ని తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

శ్యామలాంబ అమ్మవారికి ఆషాఢ సారె



కైకలూరు జూలై 10 : కైకలూరులోని శ్యామలాంబ అమ్మవారికి, ఆలయంలో కొలు వైన పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామికి ఆషాఢ సారెను వికాస తరంగణి ఆధ్వర్యంలో అందజేశారు. బుధవారం వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి వికాస తరంగణి, శ్రీమన్నారాయణ గోష్ఠి మహిళలు సారెను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెళ్లారు. గోష్ఠి అధ్యక్షురాలు చిట్టి హేమలత ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి అమ్మవారికి, స్వామికి సారెను అందజేశారు.

స్వల్పంగా పెరిగిన గోదావరి

పోలవరం, జూలై 10 : పోలవరంలో గోదావరి నీటిమట్టం బుధవారం సాయంత్రానికి స్వల్పంగా పెరిగింది. స్పిల్‌వేలోకి వస్తున్న గోదావరి జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేయడం వల్ల స్పిల్‌వేలో సాధారణ నీటిమట్టం మాత్రమే నమోదైంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 26.700 మీటర్లు, స్పిల్‌వే దిగువన 16.720 మీటర్లు, కాఫర్ డ్యాంకి ఎగువన 26.800 మీటర్లు, కాఫర్ డ్యాంకి దిగువన 15.690 మీటర్లు నమోదైనట్టు ఈఈలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

పట్టిసీమ నుంచి 6,372 క్యూసెక్కుల విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 6,372 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్టు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు బుధవారం తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 15.022 మీటర్లకు చేరుకుందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 18 పంపులు 18 మోటార్లతో నీటిని విడుదల చేసినట్టు తెలిపారు. ఈ నెలలో ఇప్పటివరకు 2.9260 టీఎంసీల నీటిని విడుదల చేసినట్టు తెలిపారు.

గోదావరిలో ప్లాస్టిక్ వ్యర్థాలు పారేయొద్దు

పాపికొండల టూరిజం సంద ర్భాలలో బోట్లలో వినియోగించే ప్లాస్టిక్ వ్యర్థాలు, డిస్పోజల్ గ్లాసులు, ప్లేట్లు, డ్రింకు బాటిళ్ళు గోదావరి నదిలో గానీ పాపికొండల నేషనల్ పార్కులో గానీ పారేయరాదని పోలవరం అటవీ క్షేత్రాధికారి ఎస్.దావీదురాజు సూచించారు. బుధవారం స్థానిక అటవీశాఖ కార్యాలయంలో పర్యాటక బోట్ల నిర్వాహకులతో అటవీశాఖ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు నదిలో పారేయడం వల్ల పర్యావరణంలో వన్యప్రాణులకు హాని కలుగుతుం దని, బోట్లలో అతిధ్వనులు చేసే సౌండ్ బాక్సుల వల్ల వన్యప్రాణుల స్వేచ్ఛకు భంగం కలుగుతుందని పరిమితి మేరకే వాడాలని సూచించారు.



పోలవరం ప్రాజెక్టు స్పిల్వే వద్ద గోదావరి జలాల ఉధృతి..
పట్టిసీమ ఎత్తిపోతల పథకం నీటి విడుదల

నేటి నుంచి రైతు బజార్లలో కందిపప్పు

» కిలో రూ.160కే విక్రయం : సత్యకుమార్



మాట్లాడుతున్న సత్యకుమార్

ఏలూరు రూరల్/భీమవరం టౌన్, జూలై 10 : రాష్ట్రంలో కందిపంట ఆశించినంత దిగుబడిలేక పోవడంతో కొరత ఏర్పడిందని, ప్రస్తుతానికి కొరత లేదని గురువారం నుంచి రూ.160లకే కిలో కందిపప్పు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామని ఏలూరు దాల్ మిల్లర్స్, దాల్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.టి.వి సత్యకుమార్ తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం రాష్ట్ర మంత్రి, కమిషనర్, ఇతరశాఖల అధికారులతో రాష్ట్రంలోని దాల్ మిల్లర్స్ రైస్ మిల్లర్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారని, సమావేశంలో రాష్ట్రంలో కంది పప్పు కొరతకు సంబంధించి వివరాలను మంత్రి అడిగి తెలుసుకు న్నారన్నారు. రాష్ట్రంలో రూ.160లకే కందిపప్పు విక్రయించాలని కోరారన్నారు. దీనిపై తాము సానుకూలంగా స్పందిస్తూ రూ.160లకే కంది పప్పు అందజేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. గురువారం ఉదయం ఏలూరు వన్‌టౌన్, టూటౌన్ ప్రాంతాల్లో ఉన్న రైతు బజార్లలో ఒక్కో కార్డుదారుడికి కిలో కందిపప్పు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. రాష్ట్రంలో కందిపంట విస్తీర్ణం తగ్గిందని, ప్రస్తుతం రాష్ట్రంలో 25వేల క్వింటాళ్ళ కందిపప్పు అందుబాటులో ఉందన్నారు. ప్రస్తుతం బర్మా, ఆఫ్రికాదేశాల నుంచి కంది దిగుమతి చేసుకోవాల్సి వస్తుందన్నారు. కంది పంట నిల్వ ఉంచేందుకు గొడౌన్స్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తే కందిపప్పు కొరత ఉండదన్నారు. ఏపీ చాంబర్స్ కామర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంకాయల రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం కందిపంట రైతులను ప్రోత్స హించి మద్దతు ధర అందించడంతో పాటు గిడ్డంగులు ఏర్పాటుచేసి నిల్వ అవకా శం కల్పించాలని మంత్రి నాదెండ్లకు వివరించినట్లు తెలిపారు. బియ్యం ఒక రకం రూ.48, మరో రకం రూ.49లకే కేజీ అందించేందుకు రైస్ మిల్లర్స్ సిద్ధంగా ఉన్నారన్నారు.

పశ్చిమలో 8 ప్రాంతాల్లో...

పశ్చిమ గోదావరి జిల్లాలోని ఎనిమిది ప్రాంతాల్లో గురువారం నుంచి ప్రత్యేక కౌంటర్ల ద్వారా అమ్మకాలు జరుగుతాయి. భీమవరంలో రైతుబజార్, డి-మార్ట్, రిలయన్స్ సూపర్ మార్కెట్, పాలకొల్లు, నరసాపురం రైతుల బజార్లు, తాడేపల్లిగూడెంలో ఛాంబర్ ఆఫ్ కామర్సు భవనం, తణుకు ఆర్యవైశ్య కల్యాణ మండపం, అత్తిలిలో చాంబర్‌ఆఫ్ కామర్సు భవనంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్టు జేసీ ప్రవీణ్ ఆదిత్య తెలిపారు.

ఆరోగ్యశ్రీ కార్డుదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తే చర్యలు : రాజీవ్

ఏలూరు క్రైం, జూలై 10 : ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న ప్రతిరోగికి ఉచితంగా వైద్యం అందించాలని ఆసుపత్రి యాజమాన్యం అదనంగా డబ్బులు వసూలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఏలూరు జిల్లా ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ వర్తింపు కల్గిన 31 ప్రైవేటు ఆసుపత్రులలో రోగులకు అందుబాటులో ఆరోగ్యమిత్రాలు ఉన్నారని, ఓపీలో ఔట్‌పేషెంట్ విభాగంలో టెస్టులు ఉచితంగానే చేస్తాయని ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఓపీలో ఖర్చు పెట్టుకున్న సొమ్ము ఆరోగ్యశ్రీలోదే అయితే ఖర్చుపెట్టిన సొమ్మును ఇప్పించడం కూడా జరుగుతుందన్నారు. రోగికి అదనంగా డబ్బులు వసూలు చేయడం జరగదని ఒకవేళ అటువంటి చర్యలకు పాల్పడితే ఆరోగ్య మిత్ర వారు ఆన్‌బెడ్‌కు వెళ్ళినప్పుడు రోగి మా దగ్గర డబ్బులు వసూలు చేశారని రాతపూర్వకంగా తెలియజేస్తే వెంటనే వారు ఖర్చు పెట్టిన సొమ్ము తిరిగి ఇప్పించడంతో పాటు సంబంధిత ఆసుపత్రిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు లేని వారికి కూడా ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం లేఖ ద్వారా ఆరోగ్యశ్రీలో ఉచితంగా వైద్యం అందుతుందన్నారు. ఎన్నికల కోడ్ సమయంలో ఆరోగ్యశ్రీ కార్డు లేని వారు, డబ్బులు కట్టి వైద్యం చేయించుకున్న వారికి అప్పుడు కొన్ని జబ్బులకు మాత్రమే సీఎంవో ద్వారా లేఖ ఇవ్వడం జరిగిందన్నారు. ఆ సమయంలో ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నవారికి మాత్రమే వైద్యం ఉచితంగానే అందిందని, లేని వారు సొమ్ము కట్టి వైద్యం చేయించుకున్నారన్నారు.

నిలిచిన సీటీస్కాన్ సేవలు

» ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పనిచేయని మిషన్
» ఐదు రోజులుగా రోగులకు తప్పని ఇబ్బందులు

ఏలూరు క్రైం, జూలై 10 : ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో సీటీస్కాన్ మిషన్ సేవలు ఐదు రోజుల నుంచి నిలిచిపోయాయి. ఆసుపత్రికి వచ్చే రోగులు అనేక ఇబ్బందులకు గురై చివరకు తమ ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రైవేటు స్కాన్ సెంటర్లకు వెళ్లి స్కానింగ్ చేయించుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఎన్ఆర్ఐ సంస్థ ప్రభుత్వ భాగస్వామ్యంతో ఎంఆర్ఐ, సీటీస్కాన్‌లను గత కొన్నేళ్ళుగా నిర్వహిస్తున్నారు. నిత్యం వందలాది మంది ఆసుపత్రికి వైద్య సేవల నిమిత్తం వస్తున్నారు. తలనొప్పి, పక్షవాతం, కడుపులో నొప్పి, కిడ్నీలకు సంబంధించిన వ్యాధులు, ఛాతీకి సంబంధించిన వ్యాధులు వంటి వాటికి రోజుకు వంద స్కాన్‌లుపైబడే ఇక్కడ తీస్తున్నారు. రిపోర్టు ఒకటి మాత్రమే పొందాలంటే ఇక్కడ సేవలు ఉచితంగానే చేస్తున్నారు. రిపోర్టుతో పాటు ఫిల్మ్ కావాలంటే అందుకు సంబంధించిన రుసుమును బయట స్కాన్ సెంటర్ల కంటే తక్కువగానే తీసుకుంటున్నారు. ఈనెల 6వ తేదీ నుంచి స్కాన్ పనిచేయక పోవడంతో రోగులు తమకు ఏ విధమైన వ్యాధి ఉందో అని భయపడి ఆందోళనకు గురై ప్రైవేటు స్కాన్ సెంటర్లకు వెళ్లి సిటీస్కాన్ చేయించుకుంటున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి నుంచి ప్రైవేటు ఆసుపత్రికి స్కాన్‌లు రోజూ వెళ్తూనే ఉన్నాయి. ఈ పరిస్థితి గమనించి కొంతమంది ప్రైవేటు స్కాన్ సెంటర్ వారు తమ స్కాన్‌సెంటర్‌కు సంబంధించిన రిక్విజేషన్ ఫామ్‌లను ఆసుపత్రిలో వైద్యుల టేబుళ్ళపై పెట్టేశారు. రోగులు తమ వ్యాధి బాధతో తల్లడిల్లుతూ తమకు స్కాన్ రాయాలంటూ, బయట అయినా చేయించుకుంటామని ఒత్తిడి చేయడంతో వైద్యులు ఏమి చేయలేని పరిస్థితిలో చివరకు ప్రైవేటు స్కాన్ సెంటర్‌కు వెళ్ళి చేయించుకునేలా రిక్విజిషన్ రాస్తున్నారు. సంబంధిత సిటీస్కాన్ కంపెనీకి చెందిన ఇంజనీర్లు, టెక్నీషియన్లు వచ్చి పరిశీలన జరిపి సాఫ్ట్‌వేర్ సమస్య తలెత్తి వైరస్ ఉందంటూ అందుకు సంబంధించిన నూతన సాఫ్ట్‌వేర్‌ను ఆ కంపెనీ నుంచే పొంది ఇక్కడ ఇన్‌స్టాల్ చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఎన్ని రోజులు పడుతుందో ఎవరూ చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణం సీటీస్కాన్ సెంటర్ సేవలు అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రికి వచ్చిన రోగులు కోరుతున్నారు.





సీటీస్కాన్ మిషన్.. ఏలూరు ప్రభుత్వాసుపత్రి



సర్వశిక్షా అభియాన్ వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

రెండు నెలల జీతాల బకాయిలు చెల్లించండి

» ప్లకార్డులతో సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన

ఏలూరు అర్బన్, జూలై 10:సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు పలు విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు మే, జూన్ నెలల పెండింగ్ జీతాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఏలూరులోని ఎస్ఎస్ఏ జిల్లా కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఉద్యోగులు ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఏపీ సమగ్రశిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు కె.వినోద్‌కుమార్, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే బావాజీ మాట్లాడుతూ హెచ్ఆర్ పాలసీ అమలుకు కమిటీ, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చడం, రోజువారీ వేతన సిబ్బందిని రెన్యువల్‌చేయడం, ఉద్యోగ విరమణ వయస్సుని 62 ఏళ్లకు వర్తింపజేయడం, ఇంటి అద్దె సౌకర్యం, ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు, వేకెన్సీల భర్తీ, కొన్ని నెలలక్రితం నిర్వహించిన సమ్మెకాలానికి జీతాల చెల్లింపు తదితర డిమాండ్లు ప్రభుత్వం ముందుంచామని వీటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అన్ని విభాగాల ఉద్యోగులకు కనీస వేతన స్కేలు (ఎంటీఎస్)ను వర్తింపజేయాలన్నారు. పరస్పర, రిక్వెస్టు బదిలీలలను చేపట్టాలన్నారు. త్వరలో చేపట్టనున్న మెగా డీఎస్సీ నియామకాల్లో ఎస్ఎస్ఏలో అర్హతలు గల ఉద్యోగులకు వెయిటేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘ మహిళా కార్యదర్శి కె.రాజ్యలక్ష్మి, రాష్ట్ర కమిటీ నాయకులు కె.సోమరాజు, కె.మణికంఠరాజు, టి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన వారి జాబితా విడుదల

నూజివీడు, జూలై 10: ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లలో 2024-25 విద్యా సంవత్సరానికి ఎంపికైన అభ్యర్థుల జాబితాను గురువారం ఉదయం పదకొండు గంటలకు ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి ఏలూరు జిల్లా నూజివీడు క్యాంపస్‌లో విడుదల చేయనున్నారు. కార్యక్రమానికి ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య గోపాలరాజు, అడ్మిషన్స్ కన్వీనర్ ఆచార్య అమరేంద్రకుమార్, నాలుగు క్యాంపస్‌ల డైరెక్టర్లు, అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారు.

పొగాకు రైతులు, శాస్త్రవేత్తల కృషి అభినందనీయం

» 13 మంది పొగాకు రైతులకు టీఐఐ అవార్డులు » మరో ముగ్గురు శాస్త్రవేత్తలకూ పురస్కారాలు » సత్కరించిన ఎంపీ పురందేశ్వరి



ఉత్తమ రైతు అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఎంపీ పురందేశ్వరి

దేవరపల్లి, జూలై 10: 'పొగాకు సాగులో రైతులతోపాటు శాస్త్రవేత్తల కృషి అభినందనీయమని.. ప్రపంచంలోనే నాణ్యమైన పొగాకు ఉత్పత్తులకు మనదేశం పెట్టింది పేరు. అందులోనూ అత్యధిక స్థాయిలో పొగాకు పండించేది కూడా మన రాష్ట్రమే' అని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో బుధవారం కరుటూరి ఫంక్షన్ హాలులో టుబాకో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (టీఐఐ) 24వ అవార్డు కార్యక్రమంలో ఆమె పాల్గొని పొగాకు శాస్త్రవేత్తలు, రైతులను అవార్డులతో సత్కరించారు. రాష్ట్ర స్థాయిలో మొత్తం 16 మంది అవార్డులకు ఎంపిక కాగా, వారిలో 13 మంది రైతులకు, ముగ్గురు శాస్త్రవేత్తలకు పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు రైతులు, శాస్త్రవేత్తలకు అవార్డులు అందించడం హర్షణీయమన్నారు. ఈ ఏడాది అకాల వర్షాలకు పొగాకు పంట దెబ్బతిందని, రైతుల కోరిక మేరకు పరిమితి మించి జరిగిన పొగాకు అమ్మకాలపై పెనాల్టీని రద్దుచేయాలని వాణి జ్యశాఖ మంత్రి పియూష్‌గోయల్‌తో మాట్లాడామని, త్వరలోనే నిర్ణయం వస్తుందన్నారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తుం దన్నారు. అనంతరం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడారు. పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కు మార్ మాట్లాడుతూ పొగాకు పంట ద్వారా రూ.12 వేల కోట్ల విదేశీ మారకద్రవ్యం లభిస్తోందని, ఈ పొగాకు పంటపై నాలుగు వేల కోట్ల మంది ఆధారపడుతున్నారన్నారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, పొగాకు బోర్డు వైస్ చైర్మన్ వాసుబాబు, టుబాకో బోర్డు కార్యదర్శి డి.వేణుగోపాల్, సీటీఆర్ఐ డైరెక్టర్ శేషుమాధవ్, పొగాకు రైతు సంఘం నాయకులు, అవార్డు గ్రహీతలు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు, పలు పొగాకు కంపెనీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

వర్జీనియా పొగాకు ధర రూ.381

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూ డెం పొగాకు వేలం కేంద్రాలలో వర్జీనియా పొగాకు మునుపెన్నడూ లేనివిధంగా కిలో పొగాకు ధర రూ.381కి చేరి ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. ఈనెల ఎనిమిదో తేదీన రూ.376 ఉండగా రెండు రోజుల్లోనే ఏకంగా ఐదు రూపా యలు పెరిగి రూ. 381కి చేరింది.రానున్న రోజు ల్లో ఈ ధర మరింత పెరిగే అవకాశాలున్నాయి.

మదర్ థెరిస్సా హోమ్‌కు వృద్ధురాలి తరలింపు



వృద్ధురాలిని మదర్ థెరిస్సా హోమ్‌లో చేర్పించిన వన్‌స్టాఫ్ సెంటర్ సిబ్బంది

ఏలూరు క్రైం, జూలై 10 : మహిళా భివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన్‌స్టాఫ్ సెంటర్ ఉమెన్ హెల్ప్‌లైన్ 181 ద్వారా వచ్చిన సమాచారంతో ఓ వృద్ధురాలిని సంరక్షణకు తరలించారు. ఏలూరు రూరల్ మండలం మహేశ్వరపురంలో మంగళవారం రాత్రి పెదపాడు మండలానికి చెందిన 60 ఏళ్ల వృద్ధురాలు నిరాదరణతో గడపడాన్ని గమనించిన స్థానికులు 181 కాల్ సెంటర్‌కు సమాచారం అందించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిత అధికారి కేపీవీఎల్ పద్మావతి ఆదేశాలతో వన్‌స్టాఫ్ సెంటర్ పరిపాలనాధికారిణి సీహెచ్ నిర్మల, మహిళా కార్యదర్శి, సిబ్బంది కలిసి బుధవారం ఉదయం వెళ్లారు. 60 ఏళ్ల వయస్సు ఉన్న కృష్ణకుమారిని ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో వన్‌స్టాఫ్ సెంటర్‌కు తీసుకువచ్చి సపర్యలు చేశారు. ఆమె కోసం విచారణ చేయడంతో ఎటువంటి సమాచారం ఇవ్వలేకపోయింది. ఆమె తాత్కాలిక వసతి నిమిత్తం వంగాయగూడెంలో ఉన్న మదర్‌థెరిస్సా హోమ్‌లో ఆశ్రయం కల్పించారు. ఆ వృద్ధురాలికి సంబంధించిన తగిన ఆధారాలతో మహిళాఅభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఏలూరు వారిని సంప్రదించాలని కోరారు. ఈ రిస్క్యూ టీమ్‌లో వన్‌స్టాఫ్ సెంటర్ ఏఎస్ఐ వేదకుమారి, కేసు వర్కర్ త్రివేణి, మహిళా కార్యదర్శి వైదేహి తదితరులు పాల్గొన్నారు.

పసిబిడ్డను దత్తత తీసుకున్న తెలంగాణ వాసులు



పసిబిడ్డను దత్తత తల్లిదండ్రులకు అప్పగిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు క్రైం, జూలై 10 : చంటి పిల్లలను నిరాదరించే తల్లులు ఆ చిన్నారులను ఎక్కడో కాల్వల్లోనూ, చెత్త కుప్పల్లోనూ పడవేయకుండా శిశు గృహంలో అప్పగిస్తే వారి సంరక్షణ తీసుకుని చట్ట ప్రకారం దత్తత ఇచ్చే అవకాశం కలుగుతుందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. సెంట్రల్ ఎడాప్షన్ రిసోర్స్ అథారిటీ నియమ నిబంధనల ప్రకారం 2021లో దత్తతకు దరఖాస్తు చేసుకున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన సురేందర్, మహలక్ష్మి దంపతులకు ఏలూరు శిశుగృహలో ఆశ్రయం పొందుతున్న మూడు నెలల వయస్సు గల మనోజ్ అనే బాబును బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఆమె సమక్షంలో కేఐఎఎస్ వారి ద్వారా దత్తత తల్లిదండ్రులకు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ దత్తత పొందిన పిల్లలను జాగ్రత్తగా పెంచాలని, విద్యా బోధనలు చెప్పించి ఉన్నతమైన స్థానంలోకి తీసుకురావాలన్నారు. వీరిపై పర్యవేక్షణ ఉంటుందని, ప్రతి ఆరు నెలలకు ఒకసారి జిల్లా బాలల సంరక్షణ కార్యాలయ సిబ్బంది గృహ సందర్శన చేసి పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలను రిపోర్టురూపంలో సెంట్రల్ ఎడాప్షన్ రిసోర్స్ అథార్టీ వారి కారింగ్స్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కేపీవీఎల్ పద్మావతి, జిల్లా బాలల సంరక్షణ అధికారిణి డాక్టర్ సూర్యచక్రవేణి పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా లేని రూ.1.82 కోట్ల సరుకులు గుర్తింపు

ప్రత్తిపాడు ఎరువుల గోదాముల్లో ఆకస్మిక తనిఖీలు

పెంటపాడు, జూలై 10 : రికార్డులు సరిగా లేకుండా ఎరువుల విక్రయాలు జరిపితే చట్టపరంగా చర్యలు తప్పవని విజయనగరం జిల్లా గజపతినగరం డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ కె.మహారాజన్ హెచ్చరించారు. మండలంలోని ప్రత్తిపాడు ఎంవీఆర్, ఐఎస్‌టీ ఎరువుల గోదాములలో మంగళవారం రాత్రి విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులు లేకుండా ఎంవీఆర్ గోదాములో 66 టన్నులకు సంబంధించి రూ.21,12,000 విలువైన, ఐఎస్‌టీ గోదాములో 827 టన్నుల సంబంధించి రూ.1.61 కోట్లు విలువైన సరుకులను గుర్తించినట్టు తెలిపారు. రికార్డులు చూపించేంత వరకూ సరుకు అమ్మకాలు నిలుపుదల చేశామన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ టీశ్రీనివాసరెడ్డి, ఏవోలు పార్థసారథి, ఆర్ఎస్. ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రత్తిపాడు ఎరువుల గోదాములు తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

క్రైం కార్నర్





జ్యూస్ షాపును సీజ్ చేస్తున్న అధికారులు..కాలం చెల్లిన పాల ప్యాకెట్

శ్రీవారి శేషాచలంపై కాలం చెల్లిన పాల ప్యాకెట్లు

» జ్యూస్ తయారీదారుడిని నిలదీసిన భక్తుడు » రంగంలోకి ఫుడ్‌సేఫ్టీ అధికారులు » షాపు సీజ్.. యజమానిపై కేసు

ద్వారకాతిరుమల, జూలై 10: ద్వారకాతిరుమల శ్రీవారి శేషాచలంపై ఉన్న ఓ జ్యూస్ షాపులో కాలం చెల్లిన పాల పాకెట్లతో జ్యూస్‌ను తయారు చేయడాన్ని గమనించి షాపు యజమానిని ఓ భక్తుడు నిలదీసిన ఘటన జరిగింది. వివరాలివి.. చిన వెంకన్న దర్శనార్థం ఓ భక్తుడు బుధవారం క్షేత్రానికి వచ్చి దర్శనానంతరం కొండపైన ఉన్న శ్రీలక్ష్మీ దుర్గ బాలాజీ జ్యూస్ స్టాల్‌లో ఓ జ్యూస్ తయారీకి ఆర్డర్ చేశాడు. నిర్వాహకుడు తనవద్ద ఉన్న పాలప్యాకెట్‌తో జ్యూస్ తయారుచేసి భక్తునికి ఇచ్చాడు.. పాలప్యాకెట్లను పరిశీలించిన భక్తునికి అది గడువు దాటినదిగా గుర్తించి ఆలయ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న ఆలయ లీజెస్ విభాగ సూపరింటెండెంట్ నరసింహరాజు షాపునకు వచ్చి తనిఖీలు చేపట్టారు. గడువు దాటిన 217 పాలప్యాకెట్లను గుర్తించి అధికారి ఖంగుతిన్నారు. అనంతరం ఏలూరు డివిజన్ ఫుడ్‌సేఫ్టీ అధికారి కె.రామరాజు వచ్చి పరిశీలించారు. ఆ పాల ప్యాకెట్లను చింపి ఓ పెద్ద టబ్‌లో పోయించి సీజ్ చేసి పరీక్షలకు పంపారు. అధికారి రామరాజు మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ చట్టం 58 ప్రకారం షాపు యజమానిపై కేసు నమోదు చేసి జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో చర్యలుంటాయిని తెలిపారు.

దేవస్థానం కొండపై ఉన్న పలు షాపులను వేలం ద్వారా పాటదారులకు అద్దెకు ఇస్తుంది. ఆ తరువాత అధికారుల అజమాయిషీ కొరవడడంతో కొందరు షాపు యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ దోచుకుంటున్నారు. షాపు యజమాని చేసిన పనికి ఫుడ్ పాయిజన్ జరిగి భక్తులకు ఏదైనా జరిగితే దేవాలయానికి చెడ్డపేరు వస్తుందని.. ఇప్పటికైనా ఫుడ్‌సేఫ్టీ అధికారులు షాపులను తరచూ తనిఖీ చేయాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ డ్రైవర్ మృతి

ద్వారకాతిరుమల, జూలై 10: ద్వారకాతిరుమల మండలం లక్ష్మీనగర్ వద్ద ఈనెల 8న తెల్లవారుజామున జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న డ్రైవర్ దివి దుర్గవంశీ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఆగిఉన్న ట్రాలీని వెనుక నుంచి ఓ కారు ఢీకొన్న ప్రమాదంలో బొమ్మూరు మండలం రాజవోలుకు చెందిన రాచబత్తుని భాగ్యశ్రీ, ఆమె కుమారుడు నాగనితిన్‌కుమార్, భీమవరానికి చెందిన బొమ్మా కమలాదేవి అక్కడికక్కడే దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వాడపల్లికి చెందిన డ్రైవర్ దుర్గవంశీ చనిపోవడంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య నాలుగుకు పెరిగింది. తీవ్రంగా గాయపడిన మరో చిన్నారి నాగషణ్ముఖ పరిస్థితి బాగానే ఉన్నట్లు చెబుతున్నారు.

శివాలయంలో చోరీ

బుట్టాయగూడెం, జూలై 10 :రెడ్డిగణపవరంలో వున్న కనకదుర్గ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామివారి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు పడి నగదును, విలువైన వస్తువులను ఎత్తుకుపోయారు. బుధవారం ఉదయం స్వామికి పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ అర్చకులు నాగభట్ల పద్మనాభశర్మ గుడివద్దకు వెళ్లడంతో విషయం బయటపడింది. వెంటనే ఈ విషయాన్ని గుడి పెద్దలకు, గ్రామస్థులకు చెప్పారు. ఆలయంలో సీసీ కెమేరాలు ఉన్నాయని తెలుసుకున్న దొంగలు సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. తర్వాత కట్టర్‌తో తాళాలను, స్వామివారి కానుకల డిబ్బీని కోసి సుమారు రూ.70 వేల నగదును, సుమారు రూ.30 వేల విలువైన టీవీ, సీసీ కెమెరాల మానిటర్లను ఎత్తుపోయారు. ఆలయ ధర్మకర్త భౌమరాజు ధనుంజయరాజు, ఉప సర్పంచ్ భౌమరాజు సత్యనారాయణరాజు పెద్దలు ఆధ్వర్యంలో అర్చకులు పద్మనాభశర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కోళ్లవ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, జూలై 10 :చేపల చెరువులో మేతగా వేసేందుకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తుండగా తనిఖీలు చేసి వాహనాన్ని కోళ్లవ్యర్థాలతో పాటుగా పట్టుకున్నట్టు పెదపాడు ఎస్ఐ కె.శుభశేఖర్ తెలిపారు. వాహన యజమాని, డ్రైవర్, చేపల చెరువు యజమానులపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి అదృశ్యం.. కేసు నమోదు

పెదపాడు, జూలై 10 : కళాశాలకు వెళ్లిన కుమారుడు కాలేజీ అనంతరం తిరిగి ఇంటికి రాలేదని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెదపాడు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెదపాడు శివారు రామచంద్రపురానికి చెందిన మానం బెనర్జీకి ఇద్దరు కుమారులు.. వీరిలో చిన్న కుమారుడు సాయిసంతోష్ ఏలూరులోని సీఆర్‌రెడ్డి కాలేజీలో బీఎస్సీ చదువుతున్నాడు. ఈనెల 2వ తేదీన పరీక్ష ఉందని కాలేజీకి వెళ్లి సాయంత్రం కళాశాల నుంచి బయలుదేరి ఇంటికి రాలేదు. చుట్టుపక్కల, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పెదపాడు ఎస్ఐ కె.శుభశేఖర్ తెలిపారు.


పట్టిసీమలో ఏటిగట్టు తవ్వి వదిలేసిన ప్రాంతం

ఏటిగట్టుకు తూట్లు పొడిచారు

పోలవరం, జూలై 10: మండలంలో గోదావరి తీరం కృష్ణారావుపేట, బంగారమ్మపేట, పట్టిసీమ గ్రామాల్లో ఏటిగట్టును పలువురు తమ అవసరాల కోసం తవ్వి ర్యాంపులు చేసుకుని వదిలేశారు. రానున్న వరదల సమయంలో విపత్తు ముంచుకొస్తుందని పలువురు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టిసీమ మహా శివరాత్రి ఉత్సవాల నిర్వహణ కోసం ఫెర్రీ కాంట్రాక్టర్ పట్టిసీమ వీరభద్రపురం సమీపంలో రెండు ప్రాంతాల్లో రేవు కోసం, పట్టిసీమ కొవ్వాడ కాలువ అవుట్ ఫాల్ స్లూయిజ్ సమీపంలో రెండు ప్రాంతాల్లో పార్కింగ్ కోసం ఏటిగట్టును సుమారు పది అడుగుల వెడల్పున తవ్వి వదిలేశారు. దీనికితోడు కృష్ణారావుపేట, బంగారమ్మపేట గ్రామాల సమీపంలో ప్రైవేటు రెస్టారెంట్, ఫంక్షన్ హాల్ నిర్వాహకులు రాకపోకల అనువుగా ఏటిగట్టుకు ర్యాంపులు తవ్వి వదిలేశారు. అధికారులు స్పందించి ముందస్తు జాగ్రత్తగా ఆయా ప్రాంతాలలో ఏటిగట్టు పటిష్ట పరిచే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అభివృద్ధికి ప్రాధాన్యం : ఎమ్మెల్యే రోషన్ కుమార్


ఆర్టీసీ డీఎంకు చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే రోషన్

జంగారెడ్డిగూడెం, జూలై 10: అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. గురవాయిగూడెంలో చక్రదేవరపల్లి మీదుగా వేగవరం వరకు రూ.3కోట్లతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే రోషన్‌కుమార్ బుధవారం శంకుస్థాపన చేశారు. కొంగువారిగూడెం కరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులు ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రజలంతా కూటమి ప్రభుత్వానికి సహకరించి, చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. సర్పంచ్ సాయిల సత్యనారాయణ, మండవ లక్ష్మణరావు, పెనుమర్తి రామకుమార్, పరిమి సత్తిపండు, రావూరికృష్ణ, రామలింగేశ్వరరావు, ఉండవల్లి శ్రీను, తహసీల్దార్ కె.స్లీవజోజి, ఎంపీడీవో కె.వి.ప్రసాద్, ఆంజనేయులు, వెంకట్, చంటి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల బస్ పాస్‌లకు రూ.3 లక్షలు

గ్రామీణ ప్రాంతాల నుంచి జంగారెడ్డిగూడెం పట్టణంలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు బస్ పాస్‌ల నిమిత్తం నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యం సామాజిక బాధ్యతగా రూ. 3 లక్షలు అందజేసింది. ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఆర్టీసీ డీఎంకు రూ.3 లక్షల చెక్కును అందజేశారు. ఆరువేల మంది విద్యార్థులకు బస్సు పాసుల నిమిత్తం ఉపయోగిస్తారు. దాసరి శ్యామ్ చంద్రశేషు, మేకా ఈశ్వరయ్య, కొండ్రెడ్డి కిషోర్, కొప్పాక శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలసిన చింతలపూడి ఎమ్మెల్యే రోషన్

చింతలపూడి, జూలై 10: ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌ను చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, నియోజకవర్గ టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. రోషన్‌కుమార్‌తో పాటు నియోజకవర్గం నాయకులు మాటూరి వెంకటరామయ్య, గరిమెళ్ళ చలపతిరావు, కె.రాజారెడ్డి, ఘంటా సుధీర్, ఆట్లూరి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే చంటి


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, జూలై 10: ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజల వద్దకే పాలన విధానాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. సమస్యలున్న ప్రాంతాలకు నేరుగా వెళ్ళి అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించే కార్యక్రమం కొనసాగిస్తున్నామన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, టీడీపీ నగర అధ్యక్షులు రెడ్డి శివప్రసాద్, కార్యదర్శి రెడ్డి నాగరాజు, బెల్లంకొండ కిషోర్, అమరావతి అశోక్ పాల్గొన్నారు.

రక్షిత తాగునీరు సరఫరా చేయాలి : ఎమ్మెల్యే ధర్మరాజు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మరాజు


ఉంగుటూరు, జూలై 10: వర్షాకాలం ప్రజలకు రక్షిత తాగునీటిని సరఫరా చేయాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అధికారులకు సూచించారు. ఉంగుటూరు ఎమ్మెల్యే కార్యాలయంలో భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు గణపవరం ఎంపీడీవోలతో బుధవారం ఆయన సమీక్ష జరిపారు. వర్షాల వల్ల సంభవించే వరదల వల్ల రహదారులపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, డ్రైయిన్లలో పూడిక ఎప్పటికప్పుడు తీయించాలన్నారు. ఎంపీడీవోలు స్వర్ణలత, శర్మ, శివరామకృష్ణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

హామీలు నెరవేరుస్తాం : ఎమ్మెల్యే చిర్రి బాలరాజు


కమ్యూనిటీ హాలు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

కొయ్యలగూడెం, జూలై 10: ప్రజలకు ఇచ్చిన హామీలు కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. గంగవరంలో నిర్మించిన కమ్యూనిటీ హాలును బుధవారం ఆయన ప్రారంభించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు పింఛన్లు పెంచామని, అదేవిధంగా ఉచిత ఇసుకను కూడా అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. గ్రామంలో గ్రామస్థుల కోరిక మేరకు కరాటం రాంబాబు కమ్యూనిటీ హాలును ఏర్పాటు చేశారన్నారు. రానున్న ఆరునెలల్లో అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మిస్తామన్నారు. అనంతరం గ్రామస్థుల సమస్యలు తెలుసుకున్నారు. కరాటం సాయి, రవికుమార్, వాడపల్లి రాధాకృష్ణ, జడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, సర్పంచ్ తుక్కయ్య, దుగ్గిన శ్రీను, పండు, కుమార్, కేశిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రైతు రక్షణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేశవరావు

ద్వారకాతిరుమల, జూలై 10: రైతు రక్షణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.కేశవరావు అన్నారు. ఎం.నాగులపల్లిలో బుధవారం సంఘ జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నర్సింహ అధ్యక్షతన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సంక్షోభంతో అన్నదాతలు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని.. దీనికి పాలకుల విధానాలే కారణమని విమర్శించారు. పెట్టుబడుల కంటే మద్దతు ధర తక్కువగా ఉండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన చెందారు. జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, కట్టా భాస్కరరావు, లింగరాజు, గుత్తికొండ వెంకట కృష్ణారావు, వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, బోయపాటి సత్యనారాయణ, ఎన్‌టీ సుబ్బారావు, భూలక్ష్మి, రాంబాబు పాల్గొన్నారు.

యాక్సిలేటర్ విరిగి.. నిలిచిన ఆర్టీసీ బస్సు


గురవాయిగూడెంలో నిలిచిన బస్సు

జంగారెడ్డిగూడెం, జూలై 10: గురవాయిగూడెం అయ్యప్పస్వామి ఆలయం వద్ద బుధవారం ఏలూరు నుంచి జంగారెడ్డిగూడెం వస్తున్న ఆర్టీసీ బస్సు యాక్సిలేటర్ రాడ్డు విరిగిపోవడంతో నిలిచిపోయింది. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కొద్దిసేపటికి ప్రయాణికులను వేరే బస్సులో జంగారెడ్డిగూడెం పంపించారు. జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన బస్సులు తరచు సాంకేతిక కారణాలతో నిలిచిపోతున్నాయి. కాలం చెల్లిన బస్సులు నిత్యం బస్సులు నిలిచిపోతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు.


అచ్చియ్యపాలెం సమీపంలోని చింతలబండ సాగునీటి చెరువు

పోగొండ జలాశయం నీరివ్వండి

● శివారు భూమి 60 ఎకరాలకు సాగునీటి సమస్య ● గిరిజన రైతుల వినతి

బుట్టాయగూడెం, జూలై 10: మండలంలోని పోగొండ జలాశయం నుంచి అచ్చియ్యపాలెం ప్రాంతంలోని శివారు భూములకు సాగునీటిని అందించాలని గిరిజన రైతులు అధికారులను కోరుతున్నారు. కొద్దిపాటి ఖర్చుతో సుమారు 60 ఎకరాల గిరిజన రైతు భూములకు సాగునీరు పుష్కలంగా అందుతుందని, గిరిజనులు వ్యవసాయపరంగా అభివృద్ధి చెందుతారని తెలియజేస్తున్నారు. పోగొండ జలాశయ ఎడమ పంట కాలువ చింతలబండ చెరువు సమీపం వరకు తవ్వారు. కొద్దిపాటి ఖర్చుతో కాలువను పొడిగించి చెరువులోకి నీటిని మళ్లిస్తే సాగునీరు అందడమే కాకుండా సుమారు 40 గిరిజన కుటుంబాలు లబ్ధిపొందుతాయి. అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని స్పందన లేదని గిరిజన రైతులు వాపోతున్నారు.

అచ్చియ్యపాలెం సమీపంలో చింతలబండ చెరువు దిగువన గిరిజనులు సుమారు 60 ఎకరాల్లో కేవలం వర్షాలపై ఆధారపడి వరి, ఇతర పంటలు సాగుచేస్తున్నారు. వర్షాలు పడితే పంటలు చేతికందుతాయి, లేకుంటే నష్టాల మూటగట్టుకోవాల్సిందే. సుమారు రూ.138 కోట్లతో గిరిజన భూములకు సాగునీరు అందించడానికి చింతలగూడెం-నిమ్మలగూడెం గ్రామాల సమీపంలో జైనేరు వాగుపై పోగొండ జలాశయాన్ని నిర్మించారు. జలాశయం ఎడమ కాలువ చింతలబండ చెరువుకు సమీపం వరకు తవ్వారు. కాలువను కొంచెం పొడిగించి జలాశయం నీటిని చెరువుకు మళ్లించాలని ఆయకట్టు రైతులు ఎప్పటినుంచో కోరుతున్నారు. కాలువ పొడిగిస్తే పంటలకు పుష్కలంగా సాగునీరు అందుతుందని రైతులు కోరుతున్నారు. అధికారులు స్పందించి జలాశయం నుంచి చెరువుకు నీటిని మళ్లించడం ద్వారా 60 ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా 40 గిరిజన కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుంది. స్థానిక సర్పంచ్ కుంజం వెంకటేశ్వరరావు ఇటీవల మండల పరిషత్ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చెరువుకు సాగునీటిని అందించడంపై స్పందించిన ఐటీడీఏ ఇరిగేషన్ ఏఈ వి.లక్ష్మీతులసి మాట్లాడుతూ చెరువుకు సాగునీరందించడానికి వీలుగా రైతుల భూముల్లోకి జలాశయం నీరు వచ్చేలా ఉపాధి హామీ పథకంలో సబ్ కెనాల్స్‌ను తవ్విస్తామని తెలిపారు. ఏఈ వివరణపై సర్పంచ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కాలువ పొడిగింపు అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని ఏఈ చెప్పారు.

చెరువుకు నీరు మళ్లించాలి



చింతలబండ చెరువుకు నీరు మళ్లిస్తే రైతులకు ప్రయోజనం. నేరుగా భూములకు నీరిస్తే స్వల్ప ప్రయోజనం. చెరువుకు నీటిని మళ్లిస్తే సాగునీటి ఎద్దడి సమయంలో చెరువు నీరు సాగుకు ఉపయోగపడుతుంది. వర్షాలు కురిసినపుడు మాత్రమే జలాశయం నుంచి పొలాలకు నీరందుతుంది వర్షాలు లేకపోతే సాగునీరు అందదు. చెరువుకు మళ్లిస్తే ఎప్పుడైన పొలాలకు పెట్టుకోవచ్చు.

- కుంజం వెంకటేశ్వరరావు, రైతు







కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మిక సంఘాలు, పోలవరం, ఉంగుటూరు, లింగపాలెం తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళన నిర్వహించి వినతిపత్రాలు అందజేస్తున్న అంగన్వాడీలు, కార్మికులు

కదం తొక్కిన కార్మికులు

డిమాండ్స్ డే

స్కీం వర్కర్ల నిరసన హోరు.. అధికారులకు వినతి

సమస్యలు పరిష్కరించాలని దేశవ్యాప్త పిలుపులో భాగంగా డిమాండ్స్ డే కార్యక్రమంలో జిల్లాలో పలుచోట్ల కార్మికులు కదం తొక్కారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేయాలని నినదించారు. అంగన్‌వాడీలు, స్కీం వర్కర్లు ధర్నా కార్యక్రమం చేపట్టి అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

ఏలూరు రూరల్, జూలై 10: కార్మిక సమస్యలు పరిష్కరించాలని, దేశవ్యాప్త పిలుపులో భాగంగా డిమాండ్స్ డే కార్యక్రమాన్ని కలెక్టరేట్ వద్ద బుధవారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పెద్దసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలని ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షించాలని, కార్మిక సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. నగర కార్యదర్శి వి.సాయిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ.ప్రసాద్ మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను రద్దుచేసి కార్మికచట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం అమలుచేసిన కార్మిక వ్యతిరేక విధానాలపై గత పదేళ్లుగా దేశవ్యాప్తంగా ఎన్నో ఉద్యమాలు నిర్వహించామన్నారు. దేశంలో కీలకమైన రైల్వే, బీఎస్ఎన్ఎల్, బీమా, బ్యాంకు వంటి రంగాలను ప్రైవేట్‌పరం చేసే ఆలోచనలను, కార్పొరేటర్లకు దోచిపెట్టే విధానాలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. భవననిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బి.జగన్నాథం, జె.గోపి, వీజీఎంవీఆర్ కృష్ణారావు, జి.ర కిషోర్, రజని, భవాని, టి.కిషోర్, మొహిద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం: అంగన్వాడీల న్యాయమైన కోర్కెలను తీర్చాలని అంగన్వాడీ వర్కర్ల సంఘం మండల నాయకురాలు వీఎల్ఎస్ కుమారి డిమాండ్ చేశారు. ధర్నా నిర్వహించి, నినాదాలు చేశారు. తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. మండలంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కోరుతూ సీఐటీయూ పిలుపు మేరకు అంగన్వాడీ కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. డీటీ బొడ్డేపల్లి దుర్గా ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. యండ్రపాటి సుజాత, అరుణ, మల్లేశ్వరి, భారతి, లక్ష్మి పాల్గొన్నారు.

● లింగపాలెం: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ నాయకురాలు బీజేఎస్.కుమారి అన్నారు. ధర్నా నిర్వహించి తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. వి.ఈశ్వరి, మణి, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

● నిడమర్రు: అంగన్వాడీ, ఉపాధిహామీ, ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కేంద్రం ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు డిమాండ్ చేశారు. తహసీల్దార్ పోసిబాబుకు వినతిపత్రం అందజేశారు. నిమ్మల పార్వతి, సుభాషిణి, వెంకటలక్ష్మి, ఎం.నాగలక్ష్మి, పిల్లా హరికుమారి, అల్లు సత్యవతి పాల్గొన్నారు.

● చింతలపూడి: కార్మికుల హక్కులపై జరుగుతున్న దాడులకు నిరసనగా తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కార్మిక నాయకులు సూర్యకుమార్, సీఐటీయూ నాయకులు ఆర్.వి సత్యనారాయణ, నత్తా వెంకటేశ్వరరావు, వివిధ కార్మిక సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

● భీమడోలు: నాలుగు లేబర్ చట్టాలను రద్దు చేయాలని, స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలనే పలు డిమాండ్లతో సీఐటీయూ పిలుపు మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా అధ్యక్షుడు లింగరాజు, వెంకటేశ్వరరావు, స్వర్ణకుమారి, చల్లామణి తదితరులు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: తహసీల్దార్ ఆర్‌వి.వెంకటేశ్వరావుకు అంగన్వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు వినతి పత్రాలు అందజేశారు. సీఐటీయూ మండల కార్యదరిశ చిట్టిబొమ్మ కొండలరావు, నాగసూరి, యు.నాగమణి, రాంబాబు, సత్తిబాబు, నాగు , రవి, సురేష్ ఉన్నారు.

● కొయ్యలగూడెం: లేబర్‌కోడ్‌ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యాక్షుడు ఎస్.రాంబాబుకోరారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అంగన్వాడీ, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ పిలుపు మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. డీటీ దుర్గామహలక్ష్మికి వారు వినతిపత్రాన్ని అందించారు. సీఐటీయూ నేత తులసి, నాగలక్ష్మి, హేమలత, స్వర్ణలత పాల్గొన్నారు.

● కామవరపుకోట: తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పుష్పరాజ్యం, సరళ, శాంతి, అరుణ, పద్మ, మంగతాయారు, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

● కుక్కునూరు: తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ అచ్యుతకుమారికి వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి సాయికిరణ్, వై.నాగేంద్రరావు, సుజాత, కారం రాజేశ్వరి, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.





చింతలపూడి, భీమడోలు, కొయ్యలగూడెం, ద్వారకా తిరుమల తహసీల్దార్ కార్యాలయాల వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి వినతిపత్రాలు అందజేస్తున్న అంగన్వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులు

కెమెరా సృష్టికర్త డాగురేకు నివాళి


డాగురే విగ్రహం ఫొటోగ్రాఫర్ల నివాళి

భీమడోలు, జూలై 10 : కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే ఫొటోగ్రాఫర్లకు దైవమని భీమడోలు సర్కిల్ ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరామ్ అన్నారు. భీమడోలులోని డాగురే విగ్రహం వద్ద ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. డాగురే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రహ్మారావు, రామ్మూర్తి, రంగారావు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: కెమెరాను సృష్టించి లక్షలాది మందికి ఉపాధి కల్పించిన లూయిస్ డాగురే మహనీయుడని జంగారెడ్డిగూడెం ఫొటో, వీడియో, మిక్సింగ్ యూనిట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కానుమూరి సోమరాజు అన్నారు. లూయిస్ డాగురే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూనియన్ నాయకులు సూరిబాబు, చండీశ్వరరావు, శ్రీను, రామయ్య, ప్రసాద్, సునీల్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి

ఏలూరు టూటౌన్, జూలై 10: నగరంలో పారిశుధ్య, సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరిగి సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నట్లు ఎంహెచ్‌వో డాక్టర్ మాలతి తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం సీజనల్ వ్యాధులు జాగ్రత్తల కరపత్రం విడుదల చేశారు. ఈ నెల 1నుంచి ఆగస్టు 31వరకు స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమన్నారు. కాచిచల్లార్చిన నీటినే తాగాలన్నారు. కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, కార్పొరేటర్లు ఎస్.శ్రీనివాసరావు, పాము శామ్యూల్, సూపరిడెంటెండ్ శిలాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల కాలుష్య నివారణకు సహకారం

ఉంగటూరు, జూలై 10: ఉంగుటూరులో పరిశ్రమల కాలుష్య నివారణకు పంచాయతీకి సహకరిస్తామని పరిశ్రమల యజమానులు తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బండారు సింధు అధ్యక్షతన బుధవారం జరిగిన కాలుష్య నివారణ సమావేశంలో పలువురు రైతులు కాలుష్యంపై ఫిర్యాదు చేశారు. రైల్వే గేటు అవతల ఉన్న పంట బోదెలో ఆక్వా ఆధారిత పరిశ్రమల వ్యర్థాలతో నష్టపోతున్నామని వాపోయారు. సర్పంచ్ బండారు సింధు, కార్యదర్శి కాకర్ల వెంకట గిరిధర్ ఫ్యాక్టరీలకు నోటీసులు ఇచ్చారు. పరిశ్రమల యాజమాన్యాలు బోదెను బాగు చేసి కాలుష్యం రాకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

లింగపాలెం, జూలై 10: మఠంగూడెం శివారు సుందరరావుపేటలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు దగ్ధమైంది. స్థానికుల సమాచారంతో ఫైర్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంటలు అదుపుచేశారు. అప్పటికే ప్రమాదంలో పొదిలకుమారి ఇల్లు పూర్తిగా దగ్ధం కావడంతో రూ.5లక్షలకు పైగా నష్టం కలిగినట్లు జి.వెంకటేశ్వరరావు తెలిపారు.

మైసన్నగూడెం చెరువుపై వివాదం

జంగారెడ్డిగూడెం, జూలై 10: మండలంలోని మైసన్నగూడెంలో 103 ఎకరాల ప్రభుత్వ చెరువును (నూకాలమ్మ చెరువు) చేపలు పెంచుకోవడానికి మండల పరిషత్, ఇరిగేషన్ అధికారులు అక్రమంగా వేలం నిర్వహించారని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ ఆరోపణలు నిరాధారమని ఎంపీడీవో కెవిప్రసాద్ అన్నారు. ఈచెరువు గతంలో నీటి సంఘం పరిధిలో ఉండేదని, ఇటీవల పంచాయతీ తీర్మానంతో చేపల చెరువుగా మార్చి వేలం నిర్వహణకు ప్రయత్నించినట్లు ఫిర్యాదు అందడంతో ఇరిగేషన్ అధికారులకు లేఖ రాసినట్లు తెలిపారు. చేపల చెరువుగా మార్చరాదని మైసన్నగూడెం గ్రామ కార్యదర్శికి ఇరిగేషన్ అధికారులు లేఖ రాసినట్లు తెలిపారు.

నివాసాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి


కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు

బుట్టాయగూడెం, జూలై 10: మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న గిరిజనులకు మంచినీరు, విద్యుత్, రోడ్లు సదుపాయాలు కల్పించాలని కోరుతూ బుధవారం కార్యదర్శి జె.కిరణ్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ గిరిజనులకు కనీస సదుపాయాలు కల్పించకపోవడం దారుణమన్నారు. మరియమ్మ, నాగమణి, నాగరాజు, పంతులమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానని కార్యదర్శి తెలిపారు.

పోలవరంలో మోస్తరు వర్షం

పోలవరం, జూలై 10: మండలంలో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, పోలవరం, ఇటుకలకోట, వింజరం, చేగొండపల్లి, ప్రగడపల్లి, జిల్లెల్లగూడెం, కోండ్రుకోట, ఎల్ఎన్‌డీపేట గ్రామాల్లో పలుచోట్ల పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో గోతుల్లో నీరు నిలిచి రాకపోకలు సాగించడానికి రోగులు ఇబ్బందులు పడ్డారు. పోలవరం బీసీ కాలనీలో ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణ పలువురు పాడి రైతులు గేదెలు కడుతున్నారని, వర్షాల నీరు నిలిచి అపరిశుభ్రంగా ఉంటుందని హెచ్ఎం పోశారావు తెలిపారు.

కౌలు రైతులు సాగు హక్కు పత్రం కలిగి ఉండాలి

టి.నరసాపురం, జూలై 10: కౌలు రైతులందరూ సాగుహక్కు పత్రాలను కలిగి ఉండాలని తహసీల్దార్ టి.సుభాష్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో పంటల సాగు హక్కుపత్రాలు జారీచేసే విధానంపై బుధవారం అవగాహన కల్పించారు. ఏవో బి.సుమలత మాట్లాడుతూ 3495మంది కౌలు రైతులకు సాగు హక్కుపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు, రైతుసేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత మార్పిడులను అరికడతాం

ద్వారకాతిరుమల, జూలై 10: గోదావరి జిల్లాల్లో మతమార్పిడులను అరికడతామని హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దర్శనపు శ్రీనివాస్ అన్నారు. తిమ్మాపురం దళితకాలనీలో సమరసత సేవ ఫౌండేషన్, పరిరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో శ్రీరామభజనలు చేసి దళిత వర్గాలకు భగవద్గీతలు, తీర్థప్రసాదాలు, పసుపు కుంకుమలు అందజేశారు. మద్రి ఇమ్మాన్యుల్, గోపాలకృష్ణ, సింహాద్రి భూపతి, రాజనాల రామచంద్రరావు, సుంకవల్లి రాంబాబు, తాండ్ర సందీప్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ జై భీమ్ అసోసియేషన్ కార్యవర్గం

ఏలూరు క్రైం, జూలై 10: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్, జై భీమ్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గ జాబితాను సంఘ నాయకులు ఏలూరు జిల్లా ప్రజా రవాణాధికారి వర ప్రసాద్ బుధవారం అందించారు. జిల్లా అధ్యక్షుడిగా ఏలూరు డిపో కండక్టర్ తగరం రమేష్, జిల్లా కార్యదర్శిగా ఏలూరు డిపో డ్రైవర్ కొత్తపల్లి వెంకటేశ్వరరావు(కెవిరావు) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డ్రైవర్ పామర్తి సతీష్, కోశాధికారిగా ఏలూరు డ్రైవర్ ఎస్.సునోద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఏఎంసీ పదవికోసం కిలారు వినతి

కామవరపుకోట, జూలై 10: చింతలపూడి ఏఎంసీ చైర్మన్ పదవి కోరుతూ టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ బుధవారం మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుకు విజ్ఞప్తి చేశారు. పార్టీ బలోపేతానికి నిర్విరామ కృషి చేశానని చెప్పారు. ఆయన వెంట కంఠమనేని చిన సత్యనారా యణ, సర్పంచ్‌లు గూడపాటి కేశవరావు, పసుమర్తి పార్థసారధిబాబు, గోరింక దాసు, వేముల నాగేశ్వరరావు, జిజ్జూరి బాబ్జీ, ఖాన్‌వజీర్, తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో కంప్యూటర్, డిజిటల్ తరగతులు

ఏలూరు అర్బన్, జూలై 10: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) నడుం బిగించింది. హైస్కూలు విద్యార్థులకు కంప్యూటర్, డిజిటల్ విద్యనందించేందుకు వీలుగా ప్రత్యేక తరగతి గదిని ఏర్పాటుచేయాలని సంకల్పించింది. 'నాట్స్' ప్రతినిధి ధూళిపాళ్ళ భానుప్రకాష్ సౌజన్యంతో వట్లూరు జడ్పీ హైస్కూలులో 10 కంప్యూటర్లను అందజేశారు. పాఠశాలలో డిజిటల్ తరగతి గదిని గురువారం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభిస్తారని భానుప్రకాష్ బుధవారం తెలిపారు. డిజిటల్ తరగతుల్లో కంప్యూటర్ విద్య బోధించే ఇన్‌స్ట్రక్టర్ వేతనాలను 'నాట్స్' భరిస్తుందని ఆయన తెలిపారు. 'నాట్స్' చైర్మన్ పిన్నమనేని ప్రశాంత్, ప్రెసిడెంట్ పాములపాటి మదన్, కొమ్మన లక్ష్మణ్ మోహన్, ప్రాజెక్టు ఇన్‌చార్జి నాగరాజు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** రోటరీక్లబ్ అధ్యక్షుడిగా సీఏఎన్‌జీవీవీ.స్వామి, కార్యదర్శులుగా బీఎస్వీ ప్రసాద్, కె.నాగేంద్రరావు, డైరెక్టర్లు, చైర్మన్‌లు పలువురు ప్రమాణస్వీకారం చేశారు. రోటరీ క్లబ్ గవర్నర్ పంకజాక్షన్, దామోదర్‌రెడ్డి, రోహిత్, ఎస్.ప్రసాదరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.
- **ఏలూరు టూటౌన్ :** ఏలూరు నాలుగో డివిజన్‌లో వర్షాలకు మునిగిపోయిన రోడ్లను కమిషనర్ వెంకటకృష్ణతో కలసి కోఆప్షన్ సభ్యుడు పెదబాబు పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులను రోడ్ల నిర్మాణానికి పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు.
- **నిడమర్రు :** అడవికొలను నీటి సంఘం అధ్యక్షునిగా కోటిపల్లి రాధాకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రైతుల సమావేశంలో సుమారు 300 మంది పైచిలుకు రైతులు, గ్రామపెద్దలు రాధాకృష్ణను ఎన్నుకొన్నారు. సర్పంచ్ పాలా వెంకటేశ్వరరావు, నిమ్మల దొరబాబు పాల్గొన్నారు.
- ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ ద్వారా ప్రభుత్వ సదుపాయాలను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని పెదనిండ్రకొలను పీహెచ్‌సీ డాక్టర్ కె.భాగ్యశ్రీ అన్నారు. గర్భిణులు స్కానింగ్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ పి.తేజశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.
- **భీమడోలు :** వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు ఈ నెల 11 నుంచి నెల రోజుల పాటు రోజుకు రెండు విడతలుగా విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఈఈ నటరాజన్ తెలిపారు. వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.
- భీమడోలు జడ్పీ హైస్కూల్‌లో 9 రోజులుగా జరుగుతున్న టీచ్ 2 శిక్షణ ముగిసింది. శిక్షణతో ఉపాధ్యాయుల వృత్తినైపుణ్యాలు పెరుగుతాయని డీఈవో ఎస్ అబ్రహాం అన్నారు. ఎంఈవోలు శ్రీనివాసరావు, భాస్కర కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- **పెదపాడు :** గ్రామీణ యువతకు కంప్యూటర్, ట్యాలీలో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు సత్రంపాడులోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఈనెల 22వ తేదీ నుంచి 30 రోజుల పాటు శిక్షణా కార్యక్రమం జరుగుతుందన్నారు.
- ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నాణ్యతతో ఉండాలని పెదపాడు ఎంఈవో నరసింహామూర్తి అన్నారు. ముప్పర్రు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నాణ్యతను ఆయన పరిశీలించారు.
- పెదపాడు మండలం కొక్కిరపాడులో వ్యవసాయశాఖ, ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయంపై ఏరువాక శాస్త్రవేత్తలు ఫణికుమార్, ఉషాకుమారి శిక్షణ ఇచ్చారు.
- **కామవరపుకోట :** అమరావతిలో ఈ నెల 13న సీఎం చంద్రబాబు నిర్వహిస్తున్న ప్రజావేదికకు కళాకారులంతా తరలిరావాలని ఏపీ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్.ఆర్.కృష్ణబాబు పిలుపునిచ్చారు.
- **కుక్కునూరు :** పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకటాచారి డిమాండ్ చేశారు. బుధవారం కుక్కునూరులో మండల కార్యవర్గ సమావేశం జరిగింది.


మండవల్లి తహసీల్దార్ కార్యాలయం అంగన్వాడీల ఆందోళన



కలిదిండిలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు


చాట్రాయిలో తహసీల్దార్ మక్సూద్ అలీకి అంగన్వాడీల వినతిపత్రం


ముసునూరులో డీటీ ఎమిలికుమారికి అంగన్‌వాడీల వినతిపత్రం

సమస్యలు పరిష్కరించాలి

కోర్కెల దినం సందర్భంగా అధికారులకు అంగన్వాడీ, భోజన, ఆశా వర్కర్ల వినతిపత్రం

కైకలూరు, మండవల్లి జూలై 10 : అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని యూనియన్ నాయకురాలు ఎల్. మీనాకుమారి కోరారు. బుధవారం కైకలూరులో తమ డిమాండ్లు పరిష్కరించాలని తహసీల్దార్ ఎస్. పోతురాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే మండవల్లిలో తహసీల్దార్ సుబానికి వినతిపత్రాన్ని అందజేసి కార్యాలయం వద్ద అంగన్వాడీ టీచర్లు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేబర్ కోడ్‌ను తక్షణమే రద్దు చేయాలని అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్ర శిక్షా, వెలుగు, మెప్మా, ఉపాధి హామీ, సేంద్రియ వ్యవసాయం, 108, 104 తదితర కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు చెల్లించాలన్నారు. అంగన్వాడీ టీచర్లు బి.డి. సత్యవతి, భాగ్యలక్ష్మి, కల్యాణి, రమా, నాగమణి, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ముదినేపల్లిలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రాల ఉద్యోగులు, మధ్యాహ్న భోజన పథకం వర్కర్లు తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రదర్శన నిర్వహించారు. అంగన్‌వాడీ ఉద్యోగుల మండల యూనియన్ అధ్యక్షురాలు సూరపనేని అరుణ కుమారి, నాయకులు బండి పద్మ, రెబ్ కా, మణి తదితర నాయకుల ఆధ్వర్యంలో ప్రపంచ డిమాండ్ల దినోత్సవం సందర్భంగా ప్రదర్శన జరిపి డి ప్యూటీ తహసీల్దార్ పవన్ కుమార్‌కు మెమొరాండం అందజేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.26 వేల జీతం ఇవ్వాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారానికి ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.

కలిదిండి: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు బుధవారం కలిదిండి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, నేషనల్ హెల్త్ మిషన్, వెలుగు, ఉపాధి హామీ పథకాల కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించి కనీస వేతనం, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళీరావు, సీఐటీయూ నాయకులు అబీదా బేగం, మేనకా లక్ష్మీ, కొప్పినీడి రమాదేవి, విజయలక్ష్మి, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: అఖిల భారత కోర్కెల దినం సందర్భంగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ మహ్మద్ మక్సూద్ అలీకి బుధవారం అంగన్వాడీలు వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీలు మాట్లాడుతూ కేంద్రంలో రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వాలు ఏర్పడినందున గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, ఐసీడీయస్‌ను బలోపేతం చేసి, బడ్జెట్ పెంచాలని, అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, కనీస వేతనం రూ. 26 వేలు ఇచ్చి, పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చెయ్యాలని కోరారు. అన్ని గ్రామాల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆగిరిపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి తహసీల్దార్‌కి వినతిపత్రం ఇచ్చారు. సీఐటీయూ ఆగిరిపల్లి మండల కార్యదర్శి రాజులపాటి చంటి, సీపీఎం సీనియర్ నాయకులు సత్తు కోటేశ్వర రావు, డీవైఎఫ్ నాయకుడు ముత్యాల నరేష్, ఆశా వర్కర్లు ఎన్.సునీత, సీహెచ్ నీలాంబరి, అంగన్‌వాడీ వర్కర్లు సీహెచ్ పుల్లమ్మ, జి.సూర్యకళ పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ తక్షణమే రద్దు చేయాలి

ముసునూరు: కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని అంగన్‌వాడీ యూనియన్ నియోజకవర్గ కార్యదర్శి పి.రాజకుమారి డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ పిలుపు మేరకు అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, వెలుగు వీవోఏలు సంయుక్తంగా ముసునూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి, డిప్యూటీ తహసీల్దార్ ఎమిలి కుమారికి వినతపత్రం అందజేశారు. కార్మికుల హక్కులను హరించేలా ఉన్న లేబర్ కోడ్స్‌ను ప్రభుత్వం తక్షణమే రద్దుచేసి, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, మెప్మా, ఉపాధి హామీ, ఆయుష్, సేంద్రియ వ్యవసాయం, 108, 104 తదితర పథకాల కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వారికి కనీస వేతనం రూ. 26 వేలు, పెన్షన్ సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు.


చేపల రైతు దినోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

మత్స్య రంగం అభివృద్ధికి కృషి చేయాలి

కైకలూరు జూలై 10 : మత్స్య ఉత్పత్తుల్లో కొత్త తరహా చేపల పెంపకానికి శ్రీకారం చుట్టి చేపల రంగం అభివృద్ధికి నిపుణులు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. బుధవారం కైకలూరు మత్స్యశాఖ కార్యాలయంలో జాతీయ చేపల రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. కామినేని ముఖ్య అతిథిగా మాట్లాడుతూ చేపల ఉత్పత్తుల ఎగుమతి ద్వారా రాష్ట్రానికి తలసరి ఆదాయంలో కలిదిండి, కైకలూరు మండలాలే తలమానికంగా ఉన్నాయన్నారు. కొత్త రకాల చేపలను సృష్టిస్తే రైతులకు మరింత లబ్ధి చేకూరుతుందని తద్వారా ఉత్పత్తులు కూడా పెంపొందించే అవకాశాలు ఉంటాయన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ హీరాలాల్ చౌదరి పరిశోధనలతో నేడు చేపల పరిశ్రమ ఈ స్థాయికి ఎదిగిందన్నారు. అలాగే ఆక్వా పరిశ్రమకు సంబంధించి ఎలాంటి సమస్యనైనా నూతనంగా ఏర్పాటైన రాష్ట్ర చేపల రైతు సంఘం ద్వారా తాను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. చేపల రైతు సంఘం కార్యాలయ నిర్మాణాన్ని కైకలూరులో ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే చేపల రైతు సంఘంలో ప్రతి రైతు చేరవలసిన అవసరముందని, రైతులంతా సంఘటితంగా ఉండి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, రాష్ట్ర చేపల రైతు సంఘం అధ్యక్షుడు తాడినాడ బాబు, మత్స్యశాఖ ఏడీ చాన్ బాషా, ఎఫ్‌డీవో భవిత, రైతు బత్తిన శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా బస్ పాస్‌ల పంపిణీ

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా బస్ పాస్‌లను అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. బుధవారం కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు పేరిచర్ల ప్రసాదరాజు, పైడిపాటి శివశంకర్, బోయిడి సురేష్‌ల ఆర్థిక సాయంతో నియోజకవర్గంలోని 500 మంది విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం మొత్తానికి బస్‌పాస్‌లను ఉచితంగా అందజేశారు. ఆర్టీసీ అధికారులు కె. అంకినీడు, కేఎస్ రావు, ఇన్‌చార్జి హెచ్‌ఎం సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మానవత అడ్మిషన్ ఫీజు వితరణ



కైకలూరు జూలై 10 : ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులకు స్వచ్ఛంద సేవాసంస్థ అడ్మిషన్ ఫీజులను చెల్లించడం అభినందనీయమని ప్రిన్సిపాల్ శాంతిజ్యోతి అన్నారు. బుధవారం కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొందిన 12 మంది విద్యార్థులకు అడ్మిషన్ ఫీజు నిమిత్తం రూ.24 వేలు చెక్కును మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు కొండ్రెడ్డి చిట్టెమ్మ అందజేశారు. మాజీ అధ్యక్షుడు కొండ్రెడ్డి సత్యనారాయణ, మానవత సభ్యులు గుర్రం శ్యాంకుమార్, బాషా, విరల్ పాల్గొన్నారు.

జ్యూస్ తయారీలో గడువు మీరిన పాలు

శేషాచలం కొండపై ఘటన **దుకాణం సీజ్‌చేసిన అధికారులు**

ద్వారకాతిరుమల, జూలై 10: ద్వారకాతిరుమల దివ్యక్షేత్రం కొండపైనున్న షాపులో కాలం చెల్లిన పాల ప్యాకెట్లను వినియోగించి జ్యూస్ తయారు చేస్తున్న యాజమానిపై ఓ భక్తుడు అధికారులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన అధికారులు ఆ షాపును పరిశీలించి కాలం చెల్లిన 217 పాల పాకెట్లను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని షాపును సీజ్ చేశారు. కొండపై దేవస్థానం పాట షాపు శ్రీలక్ష్మీదుర్గా బాలాజీ స్టాల్‌లో బుధవారం ఉదయం ఓ భక్తుడు జ్యూస్ కోసం ఆర్డర్ ఇవ్వగా అతడు వినియోగించిన పాలప్యాకెట్లను పరిశీలించి ఖంగుతిన్నాడు. షాపు యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేసి దేవాలయ అధికారులకు ఫిర్యాదు చేయడంతో సూపరింటెండెంట్ నరసింహరాజు వచ్చి తనిఖీ చేశారు. అనంతరం ఏలూరు డివిజన్ ఫుడ్ సేఫ్టీ అధికారి కె.రామరాజు వచ్చి తనిఖీలు చేసి కాలం చెల్లిన పాలప్యాకెట్లను గుర్తించి షాపు యజమానిపై ఫుడ్ సేఫ్టీ చట్టం సెక్షన్ 58 ప్రకారం కేసు నమోదు చేశారు. జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో బాధ్యులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ప్రజా ధనం వృథా

నిరుపయోగంగా వీఆర్వో కార్యాలయం



కలిదిండి, జూలై 10: మండలంలో వెంకటాపురం పంచాయతీ పరిధిలో ఉన్న వీఆర్వో కార్యాలయ భవనం నిరుపయోగంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయమైంది. రేయింబవళ్లు మందుబాబులు ఈ భవనం వద్ద మద్యం సేవిస్తున్నారు. తాగి పడవేసిన మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్లను ఆవరణలో పడవేస్తున్నారు. ఈ భవనం సమీపంలో ఓ వ్యక్తి అనధికారికంగా మద్యం విక్రయిస్తుండటం వల్లే మందుబాబులకు అడ్డాగా మారిందని గ్రామస్థులు మండిపడుతున్నారు. సాయంత్రం వేళ మహిళలు ఆటు వైపు వెళ్లాలంటే భయపడుతున్నారు. 2019లో ఈ భవనాన్ని నిర్మించారు. కొంతకాలంపాటు కార్యాలయంలో వీఆర్వోలు విధులు నిర్వహించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కార్యాలయంలో వీఆర్వో విధులు నిర్వర్తించకపోవటంతో నిరుపయోగంగా మారింది. సుమారు రూ.5 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించారు. భవనం చుట్టూ ముళ్లపొదలు ఉండటం, రాత్రి వేళ పాముల సంచారంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వీఆర్వో కార్యాలయాన్ని వేరే ప్రభుత్వ శాఖ కార్యాలయంగానైనా వినియోగంలోకి తీసుకొచ్చి మందుబాబుల ఆగడాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఉచిత ఇసుక ప్రజలకు వరం : మంత్రి సారథి


ర్యాలీ అనంతరం మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

నూజివీడు, జూలై 10: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక పాలసీ రాష్ట్రప్రజల పాలిట వరమని, రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఉచిత ఇసుక పంపిణీపై ప్రజల్లో అవగాహన కల్పించటానికి ఇసుక ట్రాక్టర్‌ను బుధవారం మంత్రి సారథి స్వయంగా నూజివీడు పురవీధుల్లో నడిపి, స్థానిక చిన్నగాంధీబొమ్మ సెంటర్లో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇసుక విధానంపై తీసుకున్న ప్రజావ్యతిరేక నిర్ణయంపై భవన నిర్మాణ కార్మికులు, పేద, మధ్య తరగతి ప్రజలు ఎన్నో కష్టనష్టాలకు గురయ్యారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోందన్నారు. ఈ ఉచిత ఇసుక విధానాన్ని ప్రతి పేదవాడికి తెలియజేయాలన్నారు. ఈ ఉచిత ఇసుక విధానంలో ఎలాంటి అవకతవకలు లేకుండా నిరంతరం కలెక్టర్, ఇతర అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతుందని మంత్రి వివరించారు. ఇసుక రవాణాలో ఎలాంటి అవకతవకలు జరిగినా తన దృష్టికి తెస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక పంపిణీతో నిర్మాణ రంగం పుంజుకుని, రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించటమే కాక నిర్మాణ రంగ కార్మికులకు ఉపాధి లభిస్తుందన్నారు. పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్‌లను త్వరలో తెరవడం జరుగుతుందన్నారు.

మోడల్ సిటీగా నూజివీడు..

నూజివీడు పట్టణాన్ని ఒక మోడల్ సిటీగా తీర్చిదిద్దుతానని మంత్రి పార్థసారథి హామీ ఇచ్చారు. నూజివీడులో ఒక సుందరమైన పార్క్ నిర్మిస్తానని, నూజివీడు మామిడికి మరలా పూర్వవైభవం తీసుకువచ్చి నూజివీడు పట్టణ ప్రగతిని ప్రపంచ పటంలో చూపుతానన్నారు. నూజివీడు నియోజకవర్గ ప్రజలకు ఒక పెద్దపాలేరుగా పనిచేస్తానని తెలిపారు. తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని సీఎం చంద్రబాబు, లోకేశ్‌బాబు, పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని తెలిపారు. స్థానిక తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


చిన్నంపేట తమ్మిలేరు కాజ్‌వేని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

తమ్మిలేరు కాజ్‌వేకి తాత్కాలిక మరమ్మతులు

చాట్రాయి, జూలై 10: చాట్రాయి మండలం చిన్నంపేట, చింతలపూడి మండలం శివపురం గ్రామాల మధ్య తమ్మిలేరుపై గల కాజ్‌వే అప్రోచ్ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయిస్తామని నూజివీడు పంచాయతీ రాజ్ ఈఈ బాపిరెడ్డి అన్నారు. నూజివీడు ఎమ్మెల్యే, గృహనిర్మాణశాఖా మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాల మేరకు బుధవారం చిన్నంపేట తమ్మిలేరు కాజ్‌వేని బాపిరెడ్డి పరిశీలించారు. ఇటీవల తెలంగాణలో కురిసిన భారీ వర్షాలకు తమ్మిలేరులో వరద ఉధృతి పెరగటంతో కాజ్‌వే అప్రోచ్ రోడ్డుకు గండి పడే ప్రమాదం ఏర్పడింది. చిన్నంపేట గ్రామానికి చెందిన జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి అత్తులూరు శ్రీనివాసరావు అప్రమత్తమై ట్రాక్టర్లతో గ్రావెల్ తోలి గండి పడకుండా నివారించారు. ఈ రూట్‌లో సత్తుపల్లి నుంచి చాట్రాయి మండలం మీదుగా విజయవాడకు బస్సు నడుస్తుంది. అప్రోచ్ రోడ్డుకు గండిపడితే బస్సు సర్వీసు నిలిచిపోవటమే కాక చాట్రాయి, చింతలపూడి మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోతాయి. అలాగే చిన్నంపేట రైతులకు తమ్మిలేరు అవతల, అక్కడి రైతులకు ఇక్కడ భూములు ఉండటం వల్ల రైతులు కూడా తీవ్ర ఇబ్బందులు పడతారు. అప్రోచ్ రోడ్డుకు మరమ్మతులు జరిపించాలని అత్తులూరి మంత్రి పార్థసారథికి విన్నవించటంతో ఈఈ పరిశీలనకు వచ్చారు. అప్రోచ్ రోడ్డుకు ఇరువైపులా ఇసుకతో నింపిన సిమెంట్ బస్తాలు వేసి, గ్రావెల్ ఫిల్లింగ్ చేసి వర్షాకాలంలో గండిపడకుండా చర్యలు తీసుకోవాలని డీఈఈ శ్రీనివాసరావు, ఏఈఈ కృష్ణలను ఈఈ ఆదేశించారు. ఇందుకు అవసరమైన రూ. 2 లక్షల నిధులను మండల పరిషత్ నుంచి కేటాయించాలని ఎంపీడీవో మంగాకుమారిని ఈఈ కోరగా, త్వరలో జరిగే మండల పరిషత్ సమావేశం అజెండాలో పెడతామన్నారు. పంచాయతీ కార్యదర్శి నిషాక్ అలీ గ్రామస్థులు పాల్గొన్నారు.


శ్రీశ్యామలాంబ అమ్మవారికి సారె అందిస్తున్న వికాస తరంగిణి సభ్యులు

శ్రీశ్యామలాంబ అమ్మవారికి ఆషాఢ సారె

కైకలూరు జూలై 10 : కైకలూరులోని శ్రీ శ్యామలాంబ అమ్మవారికి, ఆలయంలో కొలువైయున్న శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారికి ఆషాఢ సారెను వికాస తరంగణి ఆధ్వర్యంలో అందజేశారు. బుధవారం వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి వికాస తరంగణి, శ్రీమన్నారాయణ గోష్ఠి మహిళలు పెద్దఎత్తున సారెను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెళ్లారు. గోష్ఠి అధ్యక్షురాలు చిట్టి హేమలత ఆధ్వర్యంలో పూజలను నిర్వహించి అమ్మవారికి, స్వామివారికి సారెను అందజేశారు. ఆలయ అర్చకులు విశేష పూజలను చేయగా ఆలయ ఈవో శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వాటర్ ప్లాంట్‌కు నోటీసు



కలిదిండి, జులై 10 : ఎస్.ఆర్పీ అగ్రహారంలో బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్రరావు ఒక ప్రైవేట్ వాటర్ ప్లాంట్ యజమానికి నోటీసు జారీ చేశారు. వాటర్ ప్లాంట్‌లో నీటిని ల్యాబ్‌లో పరీక్షలు చేయగా బ్యాక్టీరియా ఉన్నట్లు నిర్ధారణ అయిందని ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జ్ ఎఈ అజయ్ తెలిపారు. బ్యాక్టీరియా ఉన్న ఈ నీటిని తాగితే ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని, కనుక నీటిని విక్రయించ వద్దని ఆదేశాలు జారీ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ పేలి ఒకరికి గాయాలు

నూజివీడు, జూలై 10: నూజివీడు పట్టణంలో అప్సరా థియేటర్ వద్ద ఉన్న భారీ ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ శాఖ నిర్వహణ లోపంతో బుధవారం సాయంత్రం పేలి ఒకరు గాయపడ్డారు. సాయంత్రం 6 గంటల సమయంలో ఈ ట్రాన్స్‌ఫార్మర్ భారీ శబ్దంతో పేలి అందులోని ఆయిల్ రహదారిపై వెళుతున్న ద్విచక్రవాహనదారుడిపై పడి స్వల్పగాయాల అయ్యాయి. వాహనం కూడా దెబ్బతింది. గాయపడిన వ్యక్తిని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఎంపీ మహేష్ యాదవ్‌కు సన్మానం



ముసునూరు, జూలై 10: ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌ను ముసునూరు మండలం వేల్పుచర్ల తెలుగు యువత బుధవారం సన్మానించింది. ఏలూరులో ఎంపీ కార్యాలయంలో తెలుగు యువత నాయకులు గరికిముక్కు నాని, తిరుపతి, రాజు, నవీన్ తదితరులు మహేష్ యాదవ్‌ను సత్కరించి, ఆయన చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముసునూరు మండ లంలోని సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలుగుయువత కోరగా ఆయన తన ఎంపీ నిధులతో ప్రాధాన్యత క్రమంలో సమస్యలను పరిష్కరిస్తానని చెప్పినట్టు నాని తెలిపారు.

చెరువులు నింపాలి: ఈవోపీఆర్డీ

ముదినేపల్లి, జులై 10 : పంచాయతీల మంచినీటి చెరువులు, పశువుల చెరువులను నింపాలని ముదినేపల్లి మండల ఈవోపీఆర్డీ డి.లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలంలోని పంచాయతీల కార్యదర్శులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాల్వలకు మరో మూడు రోజుల్లో నీరు విడుదల కానున్నందున చెరువులను నింపేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరారు.

విద్యార్థులకు పుస్తకాల వితరణ



కలిదిండి, జులై 10 : చిన తాడినాడలో బుధవారం మాన వత సేవా సంస్థ, కలిదిండి వాసవీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జడ్పీ హైస్కూల్ విద్యార్థుల కు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం అంగన్ వాడీ కేంద్రానికి టేబుల్, కుర్చీలు బహూకరించారు. వాసవీ క్లబ్ జిల్లా జోన్ చైర్మన్ నూకల శ్యామలరావు గుప్తా, మానవత చైర్మన్ పేటేటి వివేకానంద, ప్రధానోపాధ్యాయుడు అడపా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


దాగురే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఫోటోగ్రాఫర్ల సంఘ సభ్యులు

కెమెరాతో కోట్లాది మందికి ఉపాధి

కైకలూరు జూలై 10 : కెమెరా సృష్టికర్త లూయిస్ దాగురె ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమందికి ఉపాధి కల్పించిన మహనీయుడని కైకలూరు నియోజకవర్గ ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. సాగర్ అన్నారు. బుధవారం కెమెరా సృష్టికర్త లుయూస్ దాగురే 169వ వర్ధంతి సందర్భంగా కైకలూరు టీటీడీ కల్యాణ మండపం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆయన సృష్టించిన కెమెరా ద్వారా కోట్లాది మంది ప్రజలకు ఉపాధి అవకాశాలను కలిగాయన్నారు. ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు టిఎస్ ఆచారి, కె. సుమంత్, ఎన్. జాషువా, చుండ్రు సుబ్రహ్మణ్యం, చాబత్తిన కిరణ్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ జై బీమ్ అసోసియేషన్ కార్యవర్గం

ఏలూరు క్రైం, జూలై 10: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్, జై భీమ్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గ జాబితాను సంఘ నాయ కులు ఏలూరు జిల్లా ప్రజా రవాణాధికారి వర ప్రసాద్ బుధవారం అందించారు. జిల్లా అధ్యక్షుడిగా ఏలూరు డిపో కండక్టర్ తగరం రమేష్, జిల్లా కార్యదర్శిగా ఏలూరు డిపో డ్రైవర్ కొత్తపల్లి వెంకటేశ్వరరావు(కెవిరావు) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డ్రైవర్ పామర్తి సతీష్, కోశాధికారిగా ఏలూరు డ్రైవర్ ఎస్.సునోద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన వారి జాబితా

నూజివీడు, జూలై 10: ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లలో 2024-25 విద్యా సంవత్సరానికి ఎంపికైన అభ్యర్థుల జాబితాను గురువారం ఉదయం 11 గంటలకు ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి నూజివీడు క్యాంపస్‌లో విడుదల చేయనున్నారు. కార్యక్రమానికి ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య గోపాలరాజు, అడ్మిషన్స్ కన్వీనర్ ఆచార్య అమరేంద్రకుమార్, నాలుగు క్యాంపస్‌ల డైరెక్టర్లు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.



ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ

నూజివీడు, జూలై 10: నూజివీడు డివిజన్‌లోని అన్ని పీహెచ్‌సీల పరిధిలో గల ఎంఎల్‌హెచ్‌పీలకు, వైద్యులకు ఎంపీఎస్డీ కార్యక్రమంపై నూజివీడు ఏరియా ఆసుపత్రిలో ఆ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రసింగ్ అధ్యక్షతన బుధవారం 197 మందికి శిక్షణ ఇచ్చారు. డెంటల్ సర్జన్ డాక్టర్ దినేష్, నూజివీడు ఏరియా ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ హెలీన, ఏరియా ఆసుపత్రికి చెందిన డాక్టర్ శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారు. నూజివీడు డివిజన్‌లోని అన్ని గ్రామ, పట్టణ పరిధిలో త్వరలో ప్రారంభమయ్యే ఎన్సీడీ స్క్రీనింగ్ కార్యక్రమంలో వీరు అన్ని గృహాలను సందర్శించి క్యాన్సర్ స్క్రీనింగ్, డయాబెటిక్ స్క్రీనింగ్ చేసి వ్యాధి లక్షణాలు కలిగిన వారిని గుర్తించి, వారికి మెరుగైన వైద్య సేవలు అందించటానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని డాక్టర్ నరేంద్రసింగ్ తెలిపారు.

పీఏసీఎస్ ఉద్యోగులకు న్యాయం చేయాలి


మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ముదినేపల్లి, జులై 10 : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను ఏపీ పీఏసీఎస్ ఉద్యోగ సంఘ నాయకులు కోరారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో బుధవారం సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురామ్, ఉమ్మడి కృష్ణా నాయకులు కలసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని 2051 పీఏసీఎస్‌లకు చెందిన 7 వేల మంది ఉద్యోగులు వివిధ హోదాల్లో పనిచేస్తున్నారని, వారికి ఉద్యోగ భద్రత కల్పించేందుకు చట్టాన్ని రూపొందించాలని కోరారు. ఎన్నికలకు ముందు 2019లో టీడీపీ ప్రభుత్వం రూపొందించిన మానవ వనరుల విధానంలో ఉద్యోగుల జీతాలు, ఉద్యోగ భద్రత, కారుణ్య నియామకాలు తదితర ప్రయోజనాలను పొందుపర్చి జారీ చేసిన జీవో 36 నేటికీ అమలుకు నోచుకోలేదని, 2014 నుంచి జరగాల్సిన వేతన సవరణ పదేళ్లయినా అమలు కాలేదని మంత్రికి వివరించగా, తాను జీవోలను అధ్యయనం చేసి పీఏసీఎస్ ఉద్యోగులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారని సంఘ ప్రధాన కార్యదర్శి రఘురామ్ తెలిపారు.


14న మధ్యాహ్నం వరకే పేరెంట్స్ డే

ముసునూరు, జూలై 10: ముసునూరు గురుకుల పాఠశాలలో ఈ నెల 14వ తేదీ ఆదివారం పేరెంట్స్ డేను ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కొండాబత్తుల ప్రవీణ ఒక ప్రకటనలో తెలిపారు. ముసునూరు పరిసర ప్రాంతాల్లో డయేరియా వ్యాప్తి ఉండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. అలాగే విద్యార్థులకు ఈ నెల వరకు ఎటువంటి మాంసాహార పదార్థాలను తీసుకురావద్దని సూచించారు. పేరెంట్స్ డే రోజు తల్లిదండ్రులు మధ్యాహ్నం వరకు మాత్రమే తమ పిల్లల దగ్గర ఉండి వెళ్ళిపోవాలని ఉపాధ్యాయులకు సహకరించాలని కోరారు.

ఎరువుల విక్రయాల్లో నిబంధనలు పాటించాలి

ఆగిరిపల్లి, జూలై 10: డీలర్లంతా బయోమెట్రిక్ విధానంలోనే ఎరువులు విక్రయించాలని ఆగిరిపల్లి మండల వ్యవసాయ అధికారి పలగాని చెన్నారావు సూచించారు. బుధవారం మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో మం డల ఎరువులు, పురుగు మందుల డీలర్లతో సమీక్షా సమావేశం నిర్వ హించారు. డీలర్లంతా స్టాక్ బోర్డు నిర్వహించాలని, అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు విక్రయించవద్దని, అలాగే బిల్ పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్లు అప్‌డేటాగా ఉండాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



చాట్రాయి, జూలై 10: సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండటంతో మండలంలోని చిత్తపూరులో పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలో కచ్చా డెయిన్లలో పేరుకుపోయిన సిల్ట్‌ను ఎక్స్‌కవేటర్‌తో తొలగించి ట్రాక్టర్లలో లోడ్ చేసి ఊరి చివరకు తరలించారు. గ్రామంలో దోమల మందు పిచికారీ చేశారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని, వేడి ఆహారం మాత్రమే తినాలని, దోమతెరలు వాడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వర లక్షణాలు కన్పిస్తే పీహెచ్‌సీకి వచ్చి చికిత్స పొందాలని సర్పంచ్ తిరువీది రమేష్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు.

ఏరియా ఆసుపత్రికి బీరువా బహూకరణ

నూజివీడు, జూలై 10: నూజివీడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సర్జికల్ వార్డుకు నూజివీడు పట్టణంలోని రజక పేటకు చెందిన విశ్రాంత ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నారాయణపురపు కుమార్ శ్రీషిర్డిసాయి నిరుపేదల సేవా సమితి తరఫున బుధవారం సాయంత్రం బీరువాను బహూకరించారు. ఏరియా ఆసుపత్రి వైద్యాధికారి సర్జన్ డాక్టర్ శ్రీనివాస్ అందిస్తున్న ఉత్తమ సేవలకు గుర్తింపుగా ఈ బీరువాను బహూకరించినట్టు కుమార్ తెలిపారు. సర్జికల్ వార్డులో రికార్డులు భద్రపరిచే సౌలభ్యం కోసం బీరువాను అందించాన్నారు. ఏరియా ఆసుపత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.